

రేపు జిల్లాకు రానున్న ఇన్‌చార్జి మంత్రి

నిజామాబాద్ అర్బన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదివారం జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. కలెక్టరేట్‌లో రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఆహారభద్రత నూతన కార్డుల జారీపై ఉమ్మడి జిల్లాకు చెందిన అధికారులతో సమీక్షించనున్నారు. పోలీస్ కమిషనరేట్‌లో భరోసా సెంటర్‌ను ప్రారంభించనున్నారు. అనంతరం నగరంలోని గోల్‌హనుమాన్ వద్ద మున్సిపల్ జోన్ ఆఫీస్, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, మంచినీటి పథకాల పనులను ఇన్‌చార్జి మంత్రి ప్రారంభించనున్నారు.



కేంద్ర ఆర్థిక మంత్రితో ఎంపీ అర్వింద్ భేటీ

నిజామాబాద్ అర్బన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌తో ఎంపీ ధర్మపురి అర్వింద్ శుక్రవారం భేటీ అయ్యారు. ఢిల్లీలోని ఆర్థిక మంత్రి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఇటీవల జరిగిన పరిణామాలను వివరించారు. కొత్తగా జాతీయ పసుపు బోర్డు ఏర్పాటుతో రాష్ట్రంలో జరుగుతున్న ఆనందోత్సవాలను నిర్మలా సీతారామన్‌కు ఎంపీ వివరించారు.

పసుపుబోర్డు ఏర్పాటుతో రైతులకు మేలు

- జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న జాతీయ పసుబోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి

జక్రాన్‌పల్లి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పసుపుబోర్డు ఏర్పాటుతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని జాతీయ పసుబోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని మనోహరాబాద్‌లో నూతనంగా నిర్మించిన జేఎంకేపీ రైతు ఉత్పత్తిదారుల సంఘ పరిశ్రమను సందర్శించి యంత్రాలను పరిశీలించారు. అంతకుముందు సంఘ పరిశ్రమలో నిర్వహించిన మహాయజ్ఞంలో పల్లె గంగారెడ్డి పాల్గొని పూజలు చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో జిల్లాలో మొదటగా టర్మరిక్ క్లస్టర్‌ను మనోహరాబాద్‌లో ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. పసుపు రైతులు పసుపును విలువ ఆధారిత వస్తువును చేసి మార్కెటింగ్ చేసుకునేలా ఈ పరిశ్రమ రైతు ఉత్పితదారుల సంఘాలకు ఎంతో దోహదపడుతుందన్నారు. ఈ సంఘాలను ప్రోత్సహించడానికి ప్రధాని మోదీ, ఎంపీ అర్వింద్ ఎంతో కృషి చేస్తున్నారన్నారు. పసుపు బోర్డు చైర్మన్‌గా నిధులు తీసుకువచ్చి రైతులకు న్యాయం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి పర్యావరణ సంస్థ చైర్మన్ జయశ్రీ, పసుపు రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు, జేఎంకే జీఎం రైతు ఉత్పితదారుల సంఘం డైరెక్టర్ పి.తిరుపతిరెడ్డి, భూ విరాళాల దాత ములుగు ఇమగిరిరావు, పారిశ్రామికవేత్త కుకట్‌పల్లి రామారావు, రైతులు పాల్గొన్నారు.

పల్లె గంగారెడ్డికి సన్మానం..

ఆర్మూర్‌రూరల్: జాతీయ పసుపుబోర్డు అధ్యక్షుడిగా నియమితులైన పల్లె గంగారెడ్డిని శుక్రవారం మండలంలోని అంకాపూర్ గ్రామంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బండారి యాదగిరి సన్మానించారు. కార్యక్రమంలో ఆలూర్ మండల బీజేపీ ఉపాధ్యక్షుడు రమేష్, మునిపల్లి గంగారెడ్డి పాల్గొన్నారు.

నూతన పథకాలపై ఆశలు



- ఈనెల 26 నుంచి నాలుగు కొత్త పథకాల అమలు
- 21వ తేదీ నుంచి 24 వరకు గ్రామసభలు
- పథకాల అమలుకు పకడ్బందీగా అధికారుల సర్వే
- రైతుభరోసా కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్న రైతులు
- దరఖాస్తు చేసుకున్న వారందరికీ ఆహార భద్రత కార్డులు ఇవ్వాలంటున్న జిల్లా వాసులు

నిజామాబాద్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న రైతుభరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఆహార భద్రత కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలపైనే జిల్లా ప్రజలు ఆశలు పెట్టుకున్నారు. ఈ నెల 26 నుంచి పథకాలను అమలు చేయనుండటంతో వాటి కోసం వేచి చూస్తున్నారు. గ్రామాల పరిధిలో సర్వేకు వచ్చిన సిబ్బంది ద్వారా తెలుసుకోవడంతో పాటు తమ పేర్లు ఉన్నాయో లేవో పరిశీలిస్తున్నారు. వ్యవసాయ, రెవెన్యూ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారుల ఆధ్వర్యంలో సర్వేను కొనసాగిస్తున్నారు. వ్యవసాయేతర భూములను పరిశీలించడంతో పాటు వివరాలను నమోదు చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి వస్తున్న లిస్ట్‌లకు అనుగుణంగా ఆహార భద్రత కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వారి వివరాలను పరిశీలిస్తున్నారు. ఈ నెల 20లోపు సర్వేను పూర్తి చేయడంతో పాటు 24 వరకు గ్రామ సభలు నిర్వహించి అర్హుల జాబితాను ప్రకటించే విధంగా జాబితా సిద్ధం చేస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా గణతంత్ర దినోత్సవం రోజున అమలు చేసే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

5లక్షల 50వేల ఎకరాల స్థలం సాగుకు అనుకూలం

జిల్లాలో వ్యవసాయానికి అనుకూలమైన భూమి 5లక్షల 50వేల ఎకరాలకు పైగా ఉంది. ఈ భూమికి అనుగుణంగానే గత ప్రభుత్వ హయాంలో 2లక్షల 75వేల మందికి రైతుబంధు అందించారు. ప్రతీ సీజన్‌లో దాదాపు రూ.275కోట్ల వరకు రైతుబంధు కింద వారి ఖాతాల్లో జమ చేశారు. గత ప్రభుత్వ హయాంలో సాగు భూములతో పాటు పట్టాలు కలిగిన ఇతర భూములకు కూడా రైతుబంధును ఇచ్చారు. వీటిలో వెంచర్లు, గతంలో ప్రభుత్వం సేకరించిన భూములు, ఇళ్లు, కాలనీగా వెలసిన భూములు, రోడ్లకు సేకరించిన భూములు, గుట్టలు, ఇతర భూములకు కూడా రైతుబంధును ఇచ్చారు. ప్రస్తుతం ప్రభుత్వం ఈ నెల 26నుంచి రైతుభరోసాను అమలు చేయనుంది. పంటలు పండించే సాగు భూమికే ఈ రైతుభరోసాను వర్తింపజేయనుంది. ఎకరాకు సీజన్‌లో రూ.6వేలను అందించనున్నారు. రెండు సీజన్‌లు కలిపి సంవత్సరానికి రూ.12వేలు ఎకరానికి ఇవ్వనున్నారు.

545 గ్రామాల పరిధిలో సర్వే

జిల్లాలోని 545 గ్రామాల పరిధిలో సర్వేను నిర్వహిస్తున్నారు. ఈ గ్రామాల్లో పంట భూములను మినహాయించి సాగుకు యోగ్యం కాని భూములను గుర్తిస్తున్నారు. గుట్టలు, వెంచర్లు, ఇతర భూములు గుర్తించి వాటిని వ్యవసాయేతర భూముల్లో నమోదు చేస్తున్నారు. పంటలు పండించే భూములకే సాగు కోసం భరోసాను అందించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

భూమిలేని నిరుపేద కూలీలకు..

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని కూడా ఈనెల 26నుంచి ప్రారంభిస్తుంది. భూమిలేని నిరుపేద కూలీలకు ఈ పథకం కింద సంవత్సరానికి రూ.12వేలు అందించనున్నారు. జిల్లాలో 20 రోజుల పాటు ఉపాధి హామీ పథకంలో పనిచేసిన కూలీలకు ఈ పథకాన్ని వర్తింపజేయనున్నారు. జిల్లాలో ఉపాధిహామీ కింద 20 రోజుల పాటు అన్ని మండలాల్లో పనిచేసిన వారు 85,526 మంది కుటుంబాలు ఉన్నాయి. వీరిలో అర్హతగల నిరుపేద కుటుంబాలు 61,949 మంది ఉన్నారు. ఆధార్ సీడింగ్ ద్వారా ఈ లిస్ట్‌ను పరిశీలించగా భూమిలేని వారు మొత్తం అన్ని గ్రామాల పరిధిలో 43,897 మందిగా గుర్తించారు. జిల్లాలో అర్హులైన వీరందరికీ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద సంవత్సరానికి రూ.12వేలు అందించనున్నారు. ఈనెల 26న అందులో సగం రూ.6వేలు వారి ఖాతాల్లో జమ చేయనున్నారు.

జిల్లాలో 39,131 మంది జాబితా పరిశీలన

జిల్లాలో ఆహార భద్రత కార్డుల కోసం కొన్నేళ్లుగా ప్రజలు ఎదురు చూస్తున్నారు. కుటుంబాల్లో పెళ్లి చేసుకున్న వారి నుంచి వేరుగా ఉంటున్న వారు ఈ రేషన్ కార్డుల కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రభుత్వం తీసుకున్న సామాజిక, ఆర్థిక సర్వేలోని వివరాల ఆధారంగా ఈనెల 26 నుంచి రేషన్ కార్డులను మంజూరు చేసేందుకు నిర్ణయించింది. జిల్లాలోని అన్ని మండలాల పరిధిలో మొత్తం 39,131 మంది జాబితాను పరిశీలిస్తున్నారు. జిల్లాలో రేషన్ కార్డుల విషయంలో దరఖాస్తులే లక్షన్నరకు పైగా వచ్చాయి. కొత్త మెంబర్‌ను యాడ్ చేయడం, కొత్త రేషన్ కార్డుల కోసం గతంలో దరఖాస్తులు చేసుకున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం నుంచి వచ్చిన జాబితా తక్కువగా ఉండటంతో గ్రామాల్లో ఆందోళన చెందుతున్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 26న ఇందిరమ్మ ఇళ్లను కూడా మంజూరు చేయనుంది. ఇప్పటికే ఈ ఇళ్ల కోసం జిల్లా వ్యాప్తంగా సర్వే నిర్వహించారు. అర్హులైన వారిని గుర్తించారు. మరోదఫా ఈ సర్వేను కొనసాగిస్తున్నారు. జిల్లాలోని ప్రతీ నియోజకవర్గానికి 3,500 ఇళ్లను మంజూరు చేశారు. ఈ నెల 26న ఈ పథకం కోసం అర్హులైన జాబితాను నియోజకవర్గాల వారీగా ప్రకటించనున్నారు.

రైతుభరోసా వస్తే పెట్టుబడికి ఉపయోగపడుతుంది..

: నరేష్, రైతు మోకన్‌పల్లి



సంవత్సరం కాలంగా రైతులకు రైతుభరోసా రావడం లేదు. ప్రభుత్వం ఈనెల 26 నుంచి ఇచ్చేందుకు నిర్ణయించడం వల్ల రైతులకు మేలు జరగనుంది. రైతుభరోసా విడుదల చేస్తే యాసంగి సాగు చేస్తున్న రైతులకు పెట్టుబడికి ఉపయోగపడనుంది.

ఆహార భద్రత కార్డులు అందరికీ ఇవ్వాలి..

: సాయికృష్ణ, రైతు అన్నారం గ్రామం



ఆహార భద్రత కార్డుల కోసం పదేళ్లుగా ఎదురు చూస్తున్నాం. పెళ్లి అయిన తర్వాత కొత్త రేషన్ కార్డుల కోసం పలు దఫాలు దరఖాస్తులు చేశాం. ప్రస్తుతం గ్రామాల్లో సర్వే చేస్తున్న లిస్ట్‌లో తమ పేరు లేదు. దరఖాస్తు చేసుకున్న వారందరికీ కార్డులను ఇచ్చే విధంగా చూడాలి.

ఆత్మీయ భరోసా ఆర్థికంగా ఆదుకుంటుంది..

: మంగళవారం లక్ష్మి, రైతు నూత్‌పల్లి



మాకు భూమి లేదు. కూలీ మీదనే ఆధారపడి బతుకుతున్నాం. ఉపాధి హామీ పనులు ఎక్కువగా చేస్తున్నాం. ప్రభుత్వం ఆత్మీయ భరోసా కింద సంవత్సరానికి రూ.12వేలు ఇవ్వడం కుటుంబానికి పనికి వస్తుంది. ఆర్థికంగా కొంత వెసులుబాటును కల్పించనుంది.

నేడు నగర పాలక సంస్థ కౌన్సిల్ చివరి సమావేశం

- ఈనెలాఖరులోగా ముగియనున్న పదవీకాలం
- 39ఎజెండా అంశాలపై చర్చించనున్న సభ్యులు



సుభాష్‌నగర్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ చివరి సమావేశం శనివారం జరుగనుంది. జిల్లా కేంద్రంలోని నగర పాలక సంస్థ కౌన్సిల్ కార్యాలయంలో నగర మేయర్ దండు నీతూకిరణ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించనున్నారు. ఇప్పటికే కౌన్సిల్ చివరి సమావేశానికి అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. చివరి సమావేశం కావడంతో సమావేశాన్ని సజావుగా నిర్వహించేందుకు అధికారులు సమాయత్తం చేశారు. ఈనెలాఖరులోగా కార్పొరేటర్ల పదవీకాలం ముగియనుండటంతో చివరి సమావేశం కానుంది. సమావేశంలో ఎమ్మెల్యేతో పాటు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ తదితరులు పాల్గొననున్నారు. ఈ సమావేశంలో 39 ఎజెండా అంశాలపై సభ్యులు చర్చించనున్నారు. ముఖ్యంగా నగర పాలక సంస్థలో సిబ్బంది కొరతను తీర్చేందుకు ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన వివిధ విభాగాల్లో చేర్చుకునేందుకు సభ్యుల ఆమోదం కోసం చర్చ జరగనుంది. వీటితో పాటు 14వ ఫైనాన్స్‌లో 60 డివిజన్‌లకు సుమారు రూ.10లక్షల చొప్పున నిధుల వినియోగంపై చర్చ జరగనుంది. చర్చ సజావుగా జరిగేలా అధికారులు ప్రయత్నించినా ప్రతిపక్ష సభ్యులు మాత్రం వివిధ అంశాలపై చర్చకు లేవనెత్తనున్నారు. నగరంలో ఇందిరమ్మ కమిటీలో కాంగ్రెస్ కార్యకర్తలను చేర్చడంపై బీజేపీ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేయనున్నారు. వీటితో పాటు నగరంలోని సెంట్రల్ మీడియేషన్ లైటింగ్‌ను గత కొన్ని రోజులుగా పట్టించుకోకపోవడంతో లైట్లు వెలగడం లేదు. వీటిపై సభ్యులు చర్చలో లేవనెత్తనున్నారు. అధికారులు సెంట్రల్ మీడియేషన్ లైటింగ్ కార్పొరేషన్‌పై భారం అవుతుందని వీటిని కాంట్రాక్టర్లకు అప్పచెప్పేందుకు ఆమోదం కోసం సభ ముందు ఉంచనున్నారు. బీఆర్ఎస్ మేయర్ పీఠంపై కూర్చున్న బీఆర్ఎస్‌కు అనుకున్నంత సభ్యులు లేకపోవడం ఇటీవల కార్పొరేటర్లు బీజేపీ, కాంగ్రెస్‌లోకి వెళ్లడంతో బీఆర్ఎస్ సభ్యులు ఏమేరకు ప్రతిపక్షాలను ఎదుర్కొంటారో వేచి చూడాలి. చివరి సమావేశం కావడంతో చర్చ జరుగుతుందా? తూతూ మంత్రంగానే సభను ముగిస్తారా అని పలువురు చర్చించుకుంటున్నారు.



జలాల్‌పూర్‌లో సర్వే వివరాలను అడిగితెలుసుకుంటున్న కలెక్టర్

20 తేదీలోగా పరిశీలన పూర్తి చేయాలి

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

ఆర్మూర్‌రూరల్, ముప్కాల్, జనవరి17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేయనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఆహారభద్రత, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలకు ఈనెల 20వ తేదీలోగా అర్హుల పరిశీలనను పూర్తిచేయాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అధికారులకు సూచించారు. శుక్రవారం మండలంలోని సుర్బిర్యాల్ గ్రామంలో, బాల్కొండ మండలం జలాల్‌పూర్‌లో, ముప్కాల్ మండలం నాగంపేట్‌లో క్షేత్రస్థాయిలో నిర్వహిస్తున్న ఫీల్డ్ వెరిఫికేషన్ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. జలాల్‌పూర్ శివారులో వివిధ సర్వే నెంబర్‌లలో గల రైతులకు సంబంధించిన పట్టా, ప్రభుత్వ స్థలాలను పరిశీలించారు. కలెక్టర్ వెంట ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్, ప్రత్యేక అధికారులు స్రవంతి, రసూల్‌బీ, ఆర్మూర్ బాల్కొండ ఎంపీడీవోలు సాయిరాం, విజయభాస్కర్, తహసీల్దార్‌లు శ్రీధర్, గజానన్, ఏవో హరికృష్ణ, ఎంపీవో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సమాజ సేవకుడిని అభినందించిన కలెక్టర్

ఆర్మూర్‌కు చెందిన సమాజ సేవకుడు పట్వారి తులసీ కుమార్‌ను కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అభినందించారు. ఇటీవల జాతీయ స్థాయిలో భారత సేవరత్న పురస్కారాన్ని అందుకున్న సందర్భంగా శుక్రవారం కలెక్టరేట్‌లో పట్వారి తులసీ కలెక్టర్‌ను కలిశారు. సంఘసేవలో ముందుండి పురస్కారాన్ని సాధించడం అభినందనీయమని కలెక్టర్ అన్నారు.



మూడు నెలలుగా.. పోలీసు కమిషనర్ పోస్టు ఖాళీ!

- పోలీసు కమిషనర్ బదిలీ అయి మూడు నెలలు
- ఇన్‌చార్జి సీపీతోనే కొనసాగుతున్న పాలన
- ఇష్టారాజ్యంగా పలువురు అధికారుల తీరు

నిజామాబాద్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో మూడు నెలలుగా పోలీసు కమిషనర్ పోస్టు ఖాళీగా ఉన్నా.. ఇప్పటి వరకు కొత్త అధికారిని నియమించలేదు. ఇన్‌చార్జి పోలీసు కమిషనర్ ఆధ్వర్యంలోనే పాలన కొనసాగుతోంది. కొంత మంది పోలీసులు సివిల్ పంచాయితీల్లో తలదూరుస్తున్నా పట్టించుకునే వారు లేరు. పలు డివిజన్‌లలో పనిచేస్తున్న కొంత మంది అధికారుల తీరు వల్ల సమస్యలను ఎదుర్కొంటున్నారు. కీలకమైన జిల్లాకు కొత్త వారిని నియమించే అవకాశం ఉన్నా.. రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో నియామకం చేపట్టడం లేదు. దీంతో మూడు నెలలుగా సీపీ పోస్టు ఖాళీగానే ఉంది. ఇన్‌చార్జి కమిషనర్ ఉన్నా.. పూర్తి స్థాయిలో సమయం కేటాయించకపోవడం వల్ల పలు అధికారులపై ఫిర్యాదులు పెరుగుతున్నాయి. కమిషనర్‌ను నియమించాలని జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లినా.. ఇప్పటి వరకు మాత్రం ఎలాంటి చర్యలను చేపట్టలేదు.

మూడు నెలల క్రితం సీపీ కల్మేశ్వర్ బదిలీ

నిజామాబాద్ పోలీసు కమిషనర్‌గా పనిచేసిన కల్మేశ్వర్ సింగనెవార్ మూడు నెలల క్రితం బదిలీ అయ్యారు. అప్పటి నుంచి కామారెడ్డి ఎస్పీ సింధూశర్మ ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు. రాష్ట్రంలోని నల్గొండ తర్వాత అతిపెద్ద జిల్లా కావడం.. కమిషనరేట్ అయినా.. నిజామాబాద్‌కు మాత్రం మూడు నెలలుగా కొత్త కమిషనర్ నియామకం చేయడం లేదు. రాజకీయం, విస్తీర్ణం పరంగా పెద్దగా ఉండటం పోలీసు స్టేషన్లు కూడా ఎక్కువగా ఉండటం మహారాష్ట్ర సరిహద్దు ఉన్న ఈ జిల్లాకు కమిషనర్ లేకపోవడం వల్ల పర్యవేక్షించే వారు లేరు. ఇన్‌చార్జి కమిషనర్ సమయం ఇచ్చి కొంత వరకు కంట్రోల్ చేస్తున్నా.. పూర్తి స్థాయిలో పర్యవేక్షణ లేక ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

పోలీసు శాఖలో పలు పోస్టులు ఖాళీ

జిల్లాలో ప్రస్తుతం కమిషనర్ పోస్టుతో పాటు డీఐజీ, అదనపు డీసీపీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కమిషనర్ పోస్టు మూడు నెలలుగా భర్తీ చేయకపోగా అదనపు కమిషనర్ లా అండ్ ఆర్డర్ నెలన్నర రోజులుగా ఖాళీగా ఉంది. ప్రస్తుతం కామారెడ్డి ఎస్పీ ఇన్‌చార్జి కమిషనర్‌గా కొనసాగుతుండగా అదనపు డీసీపీ అడ్మిన్ బస్వారెడ్డి పర్యవేక్షిస్తున్నారు. పోలీసు కమిషనర్ కోసం నేతలు వర్గాలుగా విడిపోయి మొదట తమకు నచ్చిన వారి కోసం ప్రయత్నాలు చేసినా.. తర్వాత ప్రభుత్వానికి వదిలి పెట్టారు. కీలకమైన అధికారుల్లో ఇద్దరి పేర్లు బయటకు వచ్చిన తర్వాత మాత్రం నియామకం చేయలేదు. జిల్లాలో ప్రతీ రోజు ఏదో ఒక పోలీస్ స్టేషన్ పరిధిలోని అధికారిపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇసుక, మట్టి, భూముల పంచాయితీల్లో వారి పేర్లు బయటకు వస్తున్నాయి. ఇన్‌చార్జి కమిషనర్‌తో పాటు మల్టీజోన్-1 ఐజీపీకి ఫిర్యాదులు చేస్తున్నారు. కొంతమంది నేరుగా హైదరాబాద్‌కు వెళ్లి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తున్నారు.

ఫటా..ఫట్...

సంక్షేమ పథకాలు అర్హులకు అందజేస్తాం

● పిట్లం తహసీల్దార్ వేణుగోపాల్



ఆంధ్రజ్యోతి: గ్రామాలలో గ్రామసభలో ఎలాంటి దరఖాస్తులు స్వీకరిస్తారు ?

తహసీల్దార్: ప్రభుత్వం నియమించిన సీజన్ లో కొత్తగా ప్రవేశపెట్టిన సంక్షేమపథకాలు అర్హులైన లబ్ధిదారులను గుర్తించి అందజేస్తాం. ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ భరోసా, రైతు భరోసా, ఆహారభద్రత కార్డుల దరఖాస్తులు స్వీకరిస్తాము.

ఆంధ్రజ్యోతి: గ్రామాలలో సర్వే ఎప్పటి వరకూ చేపడతారు, ఊళ్లోలేని వారి వివరాలు ఎలా సేకరిస్తారు?

తహసీల్దార్: ప్రతి గ్రామంలో వ్యవసాయశాఖ, రెవెన్యూ, గ్రామ పంచాయతీ, అధికారులు కలిసి ఉమ్మడి సర్వే చేపడుతున్నాము. ప్రతిగ్రామంలో పక్షంరోజులు సర్వేచేయిస్తున్నాం. గ్రామాలలో లేని వారి వివరాలు సేకరించి వారిలో కూడా అర్హులకు పథకాలు అందజేస్తాం, సర్వేకు గ్రామస్థులు సహకరించాలి.

ఆంధ్రజ్యోతి: రైతు భరోసా ఎలాంటి భూములకు వర్తించదు?

తహసీల్దార్: గ్రామాలలో రైతుల పూర్తి వివరాలు ధరణిలో పీడింగ్ లో ఉన్నాయి, దాని ఆధారంగా ఇటుక బట్టీలు, రైస్ మిల్లులు, కోళ్లఫారం, రియల్ ఎస్టేట్, గుట్టలు, పంటలకు పూర్తిగా సాగుకు నోచుకోని భూములకు రైతు భరోసా రాదు.

ఆంధ్రజ్యోతి: గ్రామ సభలలో సర్వే నివేదికలు వెల్లడిస్తారా, గోప్యంగా ఉంచుతారా?

తహసీల్దార్: గ్రామాలలో సర్వే అనంతరం ప్రత్యేక అధికారులు, గ్రామ ప్రజల సమక్షంలో సర్వే నివేదికలు పూర్తిగా చదివి వినిపిస్తాం, ఎవరి వివరాలూ గోప్యంగా ఉంచము. సాగు భూములకే నివేదికలు పంపుతాం.

అర్హులైన లబ్ధిదారులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

● నియోజకవర్గంలో ఏడాదికి 3,500 ఇళ్ల మంజూరు ● బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

బోధన్ రూరల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): అర్హులైన లబ్ధిదారులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. శుక్రవారం బోధన్ మండల పరిషత్ ప్రాంగణంలో ఇందిరమ్మ ఇంటి మోడల్ హౌస్ నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలలో ఇచ్చిన హామీ ప్రకారం కాంగ్రెస్ పార్టీ అన్ని హామీలను అమలు చేస్తుందన్నారు. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో ఏడాదికి 3500 ఇందిరమ్మ ఇళ్లు ముఖ్యమంత్రి మంజూరు చేశారన్నారు. నాలుగు సంవత్సరాల పాటు అర్హులైన వారందరికీ విడతల వారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. నిరుపేదలకు ముఖ్యంగా మొదటి ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. అధికారులు ఇందిరమ్మ ఇళ్లకోసం నిర్వహించే జాబితాను రూపొందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి, టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్, మండల అధ్యక్షులు నాగేశ్వర్ రావు, మందర్నా రవి, ఎంపీడీవో బాల గంగాధర్, ఎంపీవో మధుకర్, మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బీంశంకర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు నరేందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ లు, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

స్థానికసంస్థల ఎన్నికలలో అన్ని స్థానాలూ కైవసం చేసుకోవాలి...

వచ్చే స్థానికసంస్థల ఎన్నికలలో అన్ని స్థానాలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకునేలా కార్యకర్తలు కృషి చేయాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. శుక్రవారం బోధన్ పట్టణంలోని లయన్స్ క్లబ్ సమావేశం మందిరంలో బోధన్, సాలూర మండలాల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి సర్పంచ్ లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీ అన్ని స్థానాలను కైవసం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి, టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్, మహిపాల్ రెడ్డి, మండల అధ్యక్షులు నాగేశ్వర్ రావు, మందర్నా రవి, కాంగ్రెస్ పార్టీ నాయకులు అల్లె రమేష్, గణపతి రెడ్డి, సంజీవ్ రెడ్డి, పోతారెడ్డి, బోధన్, సాలూర మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి



దండిగుట్టలో నూతన పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

బోధన్ ఎమ్మెల్యేను సన్మానించిన మహోదయ క్లబ్ సభ్యులు

నవీపేట : మండల కేంద్రంలోని మహోదయ క్లబ్ నూతన కార్యవర్గ సభ్యులు బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిని మనంగా సన్మానించారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే స్వగృహంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శాలువా, పూలమాలతో సన్మానించారు. మహోదయ క్లబ్ అందిస్తున్న వివిధ సేవా కార్యక్రమాలను వారు ఎమ్మెల్యేకు వివరించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు మోస్రా సాయిరెడ్డి, సాయిబాబా గౌడ్, రాజేందర్ రెడ్డి, గోవర్ధన్, భగవాన్, దాంగే శ్రీనివాస్, సూరిబాబు, శ్రీనివాస్ రెడ్డి, బాల్ రాజ్ గౌడ్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

ప్రజల శ్రేయస్సే ప్రభుత్వ ధ్యేయం

ఎడపల్లి : రాష్ట్ర ప్రజల శ్రేయస్సే ప్రభుత్వ ధ్యేయమని బోధన్ ఎమ్మెల్యే మాజీమంత్రి సుదర్శన్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఇందిరమ్మ నమూనా గృహ నిర్మాణానికి ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతిఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లను అందిస్తామని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఎడపల్లి సహకార సంఘం అధ్యక్షులు పోల మల్కారెడ్డి, బోధన్ వ్యవసాయ కమిటీ డైరెక్టర్ బొబ్బిలి శ్రీనివాస్, పార్టీ మండల అధ్యక్షులు పులి శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బిల్లా రామోహన్, నాయకులు లింగం, ఎల్లయ్య యాదవ్, బంజ కామప్ప, మోహన్ రెడ్డి, పాల్ల భాస్కర్ రెడ్డి, నాయకులు అధికారులు తదితరులు ఉన్నారు.

ఆరు హామీలను నెరవేర్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదే

రెంజల్ : అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను అమలు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. శుక్రవారం అంబేద్కర్ నగర్ లో రూ.20 లక్షల వ్యయంతో నూతన గ్రామ పంచాయతీ భవనానికి భూమిపూజ చేశారు. దండిగుట్టలో నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం రెంజల్ మండల కేంద్రంలో 105 మంది లబ్ధిదారులకు షాదీముబారక్, కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఆయన వెంట ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, జిల్లా అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి, మండల అధ్యక్షులు మొబిన్ ఖాన్, మాజీ జడ్పీటీసీ నాగభూషణం రెడ్డి, సీనియర్ నాయకులు మహిపాల్ రెడ్డి, సాయిరెడ్డి, జావీద్దీన్, సాయిబాబా గౌడ్, సురేందర్ గౌడ్, ధనుంజయ్, రవి, ఎంపీటీసీ రాజు, యూత్ కాంగ్రెస్ బోధన్ నియోజకవర్గ అధ్యక్షులు కార్తీక్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గైని కిరణ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పాల్గొన్నారు.

ఆర్మూర్ లో అధికారుల సర్వే



సర్వేతీరును పరిశీలిస్తున్న అధికారులు

ఆర్మూర్ టౌన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలో జరుగుతున్న కొత్త రేషన్ కార్డుల సర్వేను మున్సిపల్ కమిషనర్ రాజు పరిశీలించారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలోని 6,7,8,9,21,24 వార్డులలో లబ్ధిదారుల ఇంటింటికి వెళ్ళి సర్వే అధికారులు చేస్తున్న సర్వేను ఆయన పరిశీలించారు. ఆయన వెంట కౌన్సిలర్ ఆకుల రాము, సీనియర్ అసిస్టెంట్ శేఖర్, వార్డు ఆఫీసర్ పాల్గొన్నారు.

దుర్గారం : మండలంలోని అంబం, అక్బర్ నగర్ గ్రామాలలో రైతుభరోసా, రేషన్ కార్డుల సర్వేను శుక్రవారం ప్రత్యేక అధికారిణి నిర్మల, తహసీల్దార్ తారాబాయి, ఎంపీడీవో సురేష్ బాబులు పరిశీలించారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ కొర్వ భూషణ్, అక్బర్ నగర్ కార్యదర్శి నవీన్, అంబం కార్యదర్శి శ్రావణ్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



ఉప్లూర్ లో బాధితులకు చెక్కులు అందజేస్తున్న నాయకులు

కమ్మర్ పల్లి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉప్లూర్ గ్రామానికి చెందిన ముగ్గురికి మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను శుక్రవారం గ్రామ కాంగ్రెస్ నాయకులు బాధితుల ఇళ్లకు వెళ్లి చెక్కులను అందజేశారు. గ్రామానికి చెందిన మాసం శ్రీనివాస్ గౌడ్, గడ్డ మహేష్, పోతుల్లాగ్య వివిధ కారణాలతో ఆసుపత్రుల్లో చికిత్స తీసుకోగా ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇన్ చార్జ్ ముత్యాల సునీల్ కుమార్ ప్రత్యేక చొరవతో సీఎంఆర్ ఎఫ్ చెక్కులు మంజూరు చేయించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా బాధితకుటుంబాలు సునీల్ కుమార్ కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామకాంగ్రెస్ అధ్యక్షుడు కొమ్ముల రవీందర్, జిల్లా నాయకులు బోరసికి భాస్కర్, ఏలూ రెడ్డి, కొమ్ముల శ్రీనివాస్, నరేందర్, తక్కూరి శేఖర్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

ఏర్గట్ల : మండలంలోని తొర్తి గ్రామంలో శుక్రవారం కాంగ్రెస్ నాయకులు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన రాజారపు నరేందర్ కు రూ. 27వేలు, పోతుగంటి శేఖర్ కు రూ. 32వేలు బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ముత్యాల సునీల్ కుమార్ మంజూరి చేయించినందుకు నాయకులు, లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బిజ్జారపు బాను, మహేష్, కొండ పెద్ద భూమేష్, సుమన్ గౌడ్, ఆకుల రమేష్, కుంట శేఖర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

డొంకేశ్వర్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): డొంకేశ్వర్ మండలం నికాల్ పూర్ గ్రామంలో పేకాటస్థావరంపై దాడిచేసి ఆరుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. తెలిసిన సమాచారం మేరకు శుక్రవారం నికాల్ పూర్ గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్న ఆరుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.3,060 నగదుతో పాటు ఐదు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

7న లక్ష డప్పులు, వెయ్యి గొంతుల సభ

బోధన్ రూరల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి 7న హైదరాబాద్ కార్యక్రమంలో భాగంగా లక్షడప్పులు, వెయ్యి గొంతుల సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి లస్సింగారి భూమయ్య మాదిగ అన్నారు. శుక్రవారం బోధన్ పట్టణానికి కళాకారుల రథయాత్ర బృందం చేరుకుంది. ఈ సందర్భంగా అంబేద్కర్ కాలనీ, రాకాసిపేట ప్రాంతాలలో కళాకారులు తమ డప్పువాయిద్యాలతో ప్రజలను ఆలోచింపజేశారు. కార్యక్రమంలో మాదిగ కళామండలి జిల్లా అధ్యక్షులు నల్లా మహేందర్ మాదిగ, డప్పు కళాకారులు డప్పు సంతోష్ మాదిగ, గాంధార్ సాయి మాదిగ, నవీన్ మాదిగ, నర్సింగ్, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు గోనెపూర్ మారుతీ, రొడ్డ ప్రవీణ్, తడెం అబ్బయ్య పాల్గొన్నారు.

నకిలీ బీడీ విక్రయదారుడిపై కేసు నమోదు

బోధన్ రూరల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలో నకిలీ వాణి బీడీలు తయారు చేసి విక్రయిస్తున్న లతీఫ్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు బోధన్ పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు. శుక్రవారం బోధన్ పట్టణంలోని పలు పాన్ షాప్ లలో, కిరాణా షాపులలో నకిలీ బీడీలకు వాణిబీడీల స్టిక్కర్లు అతికించి విక్రయిస్తున్నాడన్న పక్కా సమాచారం మేరకు అతని వద్ద నుంచి 15డబ్బాల వాణి బీడీ బాక్సులను పట్టుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నకిలీ బీడీలు, గుట్కాలు విక్రయించిన చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఏర్గట్ల పీహెచ్ సీని సందర్శించిన డిప్యూటీ డీఎంహెచ్ వో



సిబ్బందితో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్ వో రమేష్

ఏర్గట్ల, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను శుక్రవారం ఆర్మూర్ డిప్యూటీ డీఎంహెచ్ వో రమేష్ సందర్శించారు. ఆసుపత్రిలో భాగంగా ఫ్రైడేడ్రై గురించి సిబ్బందికి పలు సూచనలిచ్చారు. అలాగే ఈ నెల 23వ తారీఖున కుటుంబ నియంత్రణ ఆపరేషన్ క్యాంపును ఏర్పాటు చేస్తున్నామని, ఈ క్యాంపును వినియోగించుకునేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ రక్షిత రెడ్డి, వందరి, మోహన్, ఆశావర్కర్లున్నారు.

ఎమ్మెల్యేను సన్మానించిన కాంగ్రెస్ నాయకులు



నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యేని సన్మానిస్తున్న నాయకులు

జక్రాన్ పల్లి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డిని నిజామాబాద్ రూరల్ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు సొప్పారి వినోద్ కుమార్ సన్మానించారు. ఎమ్మెల్యే, సీఎం రేవంత్ రెడ్డి ఎమ్మెల్యేతో కూడిన ఫోటోను ఇచ్చి ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డిని సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యేకు నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీసర్పంచ్ కాటిపల్లి నర్సారెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా జనరల్ సెక్రటరీ గన్ను లక్ష్మణ్, మండల మైనారిటీ అధ్యక్షుడు అక్బర్, మాజీ వైస్ ఎంపీపీ జితేందర్ నాయక్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, నట్ట తిరుపతి పాల్గొన్నారు.

మనోహరాబాద్ లో 33 పశువులకు అస్వస్థత

జక్రాన్ పల్లి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మనోహరాబాద్ లో శుక్రవారం జొన్న లాపలు తిని 33 పశువులు అస్వస్థత గురైనట్లు గ్రామస్థులు తెలిపారు. విషయం తెలుసుకున్న గ్రామస్థులు వెంటనే పశువులను గ్రామానికి తీసుకువచ్చి చికిత్స చేయించారు. అస్వస్థతకు గురైన పశువులు, చికిత్స చేశామని, పశువులు కోలుకుంటున్నాయని మండల పశువైద్యాధికారిణి డాక్టర్ అశిత తెలిపారు.

వ్యవసాయ భూములకే రైతు భరోసా పథకం



లబ్ధిదారుల వివరాలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ అంకిత్

భీమ్ గల్ రూరల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): పంటలు పండే వ్యవసాయ భూములకే రైతుభరోసా పథకం వర్తిస్తుందని అదనపు కలెక్టర్ అంకిత్ తెలిపారు. శుక్రవారం మండలంలోని చేంగల్ గ్రామంలో నిర్వహిస్తున్న రేషన్ కార్డుల సర్వే రైతు భరోసా సర్వేను పరిశీలించారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన అభివృద్ధి పథకాల సర్వేను పకడ్బందీగా అమలు చేయాలని ఆయన అధికారులను సూచించారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న కొత్తరేషన్ కార్డులు లబ్ధిదారులకు గ్రామసభలు పెట్టి అర్హులైన పేదలను గుర్తించి వారికి రేషన్ కార్డులు ఇవ్వాలని సూచించారు. అలాగే రైతులు పండించే భూములకే రైతు భరోసా పథకం వర్తిస్తుందని, గుట్టలకు వెంచర్లకు రోడ్లకు ఈ పథకం వర్తించదన్నారు. ఆయన వెంట తహసీల్దార్ మహమ్మద్ షబ్బీర్, ఎంపీడీవో గంగుల సంతోష్ కుమార్, వ్యవసాయ శాఖ అధికారులు, పంచాయతీ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

● ఆర్మూర్ ఎంవీఐ వివేకానంద రెడ్డి

కమ్మర్ పల్లి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ రోడ్డుప్రమాదాలను నివారించాలని ఆర్మూర్ వెహికిల్ ఇన్ స్పెక్టర్ వివేకానంద రెడ్డి అన్నారు. శుక్రవారం కమ్మర్ పల్లి వచ్చిన సందర్భంగా ఉప్లూర్ వెళ్లే దారిలో పలు వాహనాలను తనిఖీ చేశారు. సరైన ధృవపత్రాలు లేని వాహనాలను ఆటోలు, ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేశారు. అనంతరం ఆటోడ్రైవర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయరోడ్డుభద్రతా మాసోత్సవాల్లో భాగంగా ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు వాహనదారులకు కౌన్సెలింగ్ నిర్వహించినట్లు తెలిపారు. ఆయతో పాటు ఆర్మూర్ ఆర్టీఓ కార్యాలయ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

మోస్రాలో గ్రామసభల తేదీలు ఖరారు

మోస్రా, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందించేందుకు మోస్రాలోని గ్రామాల్లో గ్రామసభల తేదీలు మండల ఎంపీడీవో శ్రీనివాస్ ప్రకటించారు. ఈ నెలలో గ్రామసభలు పూర్తి కావాలని 21న తిమ్మాపూర్, 22న చింతకుంట, 23న మోస్రా, 24 న గోవూర్ దుబ్బతండాలో గ్రామసభలు నిర్వహించడం జరుగుతుందన్నారు. గోవూర్ గ్రామ శివారులోని పంట భూములను సర్వే చేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి రమేష్ రాథోడ్, ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ మారుతి, ఏఈవో నవ్యశ్రీ, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్, సహకార సంఘం అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

పట్టాలు పంపిణీ చేయాలని వినతి

కోటగిరి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): పోతంగల్ మండలంలోని చేతన్ నగర్ గ్రామానికి చెందిన పలువురు రైతులు తమసాగు భూములకు పట్టాపాసు పుస్తకాలు పంపిణీ చేయాలని కోరారు. పోతంగల్ తహసీల్దార్ కార్యాలయంలో ఈ విషయమై శుక్రవారం వినతిపత్రం అందజేశారు. గత 20ఏళ్ల క్రితం ప్రభుత్వం గ్రామంలో సాగుభూమి లేని రైతులను గుర్తించి ప్రతి ఒక్కరికీ 17 గుంటల భూమిని అందజేసిందన్నారు. 50మందికి పట్టాలు అందించి మిగిలిన 40 మందికి పట్టాపాసుపుస్తకాలు అందలేదన్నారు. పట్టాపాసు పుస్తకాలు లేకపోవడంతో రైతుబంధు, రైతు బీమా, పంట రుణాలు పొందలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మక్కయ్య, సునీల్, సాయిలు, కవిత తదితరులు పాల్గొన్నారు.

కొలనుపాక మహాపాదయాత్ర కరపత్రాల ఆవిష్కరణ

కోటగిరి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): పోతంగల్ మండలంలోని సుంకిని గ్రామంలో శుక్రవారం శ్రీ సద్గురు సిద్ది లింగాప్ప మహారాజ్ కొలనుపాక మహ పాదయాత్ర కరపత్రాలు ఆవిష్కరించారు. యాదాద్రి జిల్లాలోని కొలనుపాక ఆదీ జద్గురు రేణుకా చార్య పుణ్యక్షేత్రానికి మార్చి 3వ తేదిన సుంకిని నుండి మహ పాదయాత్ర ప్రారంభం అవుతుందన్నారు. తొమ్మిది రోజుల పాటు కొనసాగే పాదయాత్రలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నాగభూషణం, రాజు, సంతోష్, నాగేష్, మాజీ సర్పంచ్ లు మాదవరావు, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు సన్మానం

ఆర్మూర్ టౌన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాంమందిర్ పాఠశాల ఆవరణలో విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో శుక్రవారం పారిశుధ్య కార్మికులను ఘనంగా సన్మానించారు. సామాజిక, సామరస్యత కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులను పట్టుశాలువా, పూలమాలతో సన్మానించి భగవద్గీత బుక్ లను అందజేశారు. కార్యక్రమంలో హిందూ జిల్లా కార్యదర్శి గాజుల దయానంద్, విశేష సంపర్క్ ప్రముఖ్ అల్జాపూర్ అక్షయ్, ప్రచార ప్రముఖ్ నిఖిల్, నగర అధ్యక్షుడు గంగాధర్, గంగాధర్ గౌడ్, కత్తి శీను, అజయ్, అభి, ప్రవీణ్, ప్రేమ్, తదితరులు పాల్గొన్నారు.

నాగాపూర్ లో లిఫ్ట్ కు రెండోమోటార్ పంపిణీ

ముప్కాల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): బాల్కొండ మండలం నాగాపూర్ లోని లిఫ్ట్ కు మంజూరైన రెండోమోటార్ ను శుక్రవారం పంపిణీ చేశారు. గతంలో గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు తమ లిఫ్ట్ కు రెండోమోటార్ కావాలని బాల్కొండ నియోజకవర్గ ఇన్ చార్జి ముత్యాల సునీల్ కుమార్ కు విన్నవించిన వెంటనే స్పందించి రెండోమోటార్ ను పంపిణీ చేసినందుకు ఆయనకు గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో నాగాపూర్ గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

భీమ్ గల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): పట్టణ కేంద్రంలో కప్పలవాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ ను పట్టుకున్నట్లు ఎస్సై మహేష్ తెలిపారు. గురువారం రాత్రి సమయంలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా భీమ్ గల్ పట్టణంలో ఇసుక లోడ్ తో వెళ్తున్న ట్రాక్టర్ ను ఆపి డ్రైవర్ అలకుంట సింహాద్రి వద్ద ఎలాంటి పత్రాలు లేనందున ఇసుక ట్రాక్టర్ ను పట్టుకొని పోలీస్ స్టేషన్ కు తరలించి సీజ్ చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మండల బీజేపీ అధ్యక్షుడికి సన్మానం

జక్రాన్ పల్లి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బ్రాహ్మణపల్లిలో మండల పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నూతనంగా బీజేపీ అధ్యక్షుడు కన్నెపల్లి ప్రసాద్ ను మండల పద్మశాలి సంఘం అధ్యక్షుడు నిరోజ్ కర్ సన్మానించారు. అనంతరం కన్నెపల్లి ప్రసాద్ ను శాలువా, పూలమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా కన్నెపల్లి ప్రసాద్ మాట్లాడుతూ పద్మశాలిలు రాజకీయంగా, ఆర్థికంగా అన్ని రంగాల్లో ఎదిగి ముందుకు వెళ్లేందుకు కృషి చేస్తారన్నారు. కార్యక్రమంలో మండల పద్మశాలి సంఘం నాయకులు రాజేందర్, శ్రీకాంత్, రాజేశ్వర్, స్వామి, శ్రీనివాస్, రమేష్, పద్మశాలి సంఘ సభ్యులు పాల్గొన్నారు.

20న బషీరాబాద్ ఐటీఐలో ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటీస్ మేళా

కమ్మర్ పల్లి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 20న కమ్మర్ పల్లి మండలం బషీరాబాద్ లోని తెలంగాణ ప్రభుత్వ ఉపాధి కల్పన, శిక్షణ శాఖ ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటీస్ మేళా నిర్వహిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ ఎంకోటిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఐటీఐ ఉత్తీర్ణులైన విద్యార్థులు తమ ఒరిజినల్ ధృవీకరణ పత్రాలతో ఈ నెల 20న బషీరాబాద్ ఐటీఐ కళాశాలలో ఉదయం 10 గంటల వరకు హాజరుకావాలని తెలిపారు. ఈ మేళాలో వరుణ్ మోటార్స్ హైదరాబాద్ కంపెనీ, సుశీత్ స్టార్ మిల్ కంపెనీ నిజామాబాద్, ప్రీమియర్ ఎనర్జీస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ హైదరాబాద్, ఏజెరెస్ట్ స్టాటెస్ కంపెనీ సాంగారెడ్డి వారు హాజరై ఇంటర్వ్యూల ద్వారా ఎంపికచేసుకుంటారని తెలిపారు. ఆసక్తిగల నిరుద్యోగులు ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గూగుల్ ఫారం లింక్ ద్వారా తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

రైతుల అభివృద్ధే కేంద్ర ప్రభుత్వ లక్ష్యం

● బీజేపీ రాష్ట్ర నాయకుడు ఏలేటి మల్లికార్జున్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర నాయకుడు

భీమ్ గల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర రైతుల బీజేపీ తోనే అండ నిలుస్తుందని బీజేపీ రాష్ట్ర నాయకుడు ఏలేటి మల్లికార్జున్ రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణ కేంద్రంలోని ఎస్ఆర్ ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర పసుపు రైతుల చిరకాల వాంఛ అయిన పసుపుబోర్డును జిల్లాకు తీసుకువచ్చేందుకు రెండోసారి ఎంపీగా గెలిచిన అర్వింద్ నిరంతరం కృషి చేయడంతో ప్రధాని మోదీ కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ జిల్లాకు పసుపుబోర్డు కేటాయించడంతో పాటు జాతీయ పసుపుబోర్డు చైర్మన్ గా ఇదే ప్రాంతానికి చెందిన పల్లె గంగారెడ్డిని నియమించడంతో రైతాంగాన్ని ప్రధానికి ఉన్న అభిమానాన్ని నిరూపించుకున్నారన్నారు. కాని ఇవన్ని ఏడుగురి కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు తాము లేఖలు రాస్తేనే వచ్చాయని భుజాలు తడుముకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కవిత ఎంపీగా ఉండి ఏనాడు కూడా ప్రపోజల్ తీసుకురాకుండా ఇప్పుడు రైతాంగాన్ని మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాక ముందే ప్రధాని మోదీ జిల్లాకు పసుపుబోర్డును ప్రకటించారని, ఎన్నికలకు ముందు బల్దాపూర్ షైనింగ్ అక్రమాలపై మాట్లాడిన మానాల మోహన్ రెడ్డి ఇప్పుడు ఎందుకు మాట్లాడడంలేదని ప్రశ్నించారు. అనంతరం భీమ్ గల్ బస్టాండ్ ప్రాంతంలో ప్రధాని మోదీ, ఎంపీ అర్వింద్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సమావేశంలో మండల, పట్టణ బీజేపీ అధ్యక్షులు మహిపాల్, కనికరం మధు, పట్టణ రైతు అధ్యక్షుడు తేట గంగాధర్, నీలం గంగాధర్, బీజేవైఎం అధ్యక్షుడు చందు, నాయకులు హరిబాబు, గంగాధర్ గౌడ్, సంధ్యా రాజ, నవీన్, హరిప్రసాద్ పాల్గొన్నారు.

జిల్లాకు పసుపు బోర్డు తీసుకువచ్చిన ఘనత బీజేపీదే

బోధన్ రూరల్ : రాష్ట్రంలో జిల్లాకు పసుపుబోర్డు తీసుకువచ్చిన ఘనత కేంద్ర ప్రభుత్వం బీజేపీదేనని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేడపాటి ప్రకాష్ రెడ్డి అన్నారు. శుక్రవారం జాతీయ పసుపు బోర్డు చైర్మన్ గా నియమితులైన పల్లెగంగారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం, ప్రధాని మోడీ అనేక రకాలుగా కృషి చేస్తున్నారన్నారు. వచ్చే సంస్థాగత ఎన్నికలలో బీజేపీ పార్టీ అత్యధిక స్థానాలను కైవసం చేసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణలో బీజేపీ పార్టీ పూర్తిస్థాయిలో బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికలలో తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. రాష్ట్రానికి ఇచ్చిన ఒక్క హామీని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తుందని, దీనికి పసుపు బోర్డే ఉదాహరణగా వివరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి సుధాకర్ చారి, బోధన్ పట్టణ అధ్యక్షులు కోరిపాక బాలరాజు, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బీజేపీ కౌన్సిలర్ వినోద్, నాయకులు ప్రతాప్ సప్రా, సంగ్రామ్ పటేల్, దర్శన్, వాసు, అరవింద్, సాయినాథ్, గంగాధర్, సన్నీలతో బీజేపీ నాయకులు తదితరులున్నారు.

పసుపుబోర్డు ఏర్పాటుకు కేఆర్.సురేష్ రెడ్డి నిరంతర కృషి

ఆర్మూర్ రూరల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు పసుపుబోర్డు మంజూరు కావడం వెనుక బీఆర్ఎస్ పార్టీ పార్లమెంట్ ఫ్లోర్ లీడర్ కేఆర్.సురేష్ రెడ్డి కృషి ఉందని రాంపూర్ మాజీసర్పంచ్ బొడ్డు గంగాధర్ శుక్రవారం ఒక ప్రకటనలో అన్నారు. పసుపుబోర్డు ఏర్పాటుపై పార్లమెంట్ లో ప్రభుత్వాన్ని ప్రశ్నించి నిలదీసి ఒప్పించిన కేఆర్.సురేష్ రెడ్డి నిరంతరం రైతుల సంక్షేమం కోసం కృషి చేశారని ఆయన అన్నారు.

పసుపుబోర్డు విధివిధానాలను రైతులకు తెలపాలి

వేల్పూర్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ఏర్పాటైన జాతీయ పసుపుబోర్డు విధివిధానాలను రైతులకు తెలియజేయాలని బీఆర్ఎస్ జిల్లా రైతువిభాగం మిట్టపల్లి మహిపాల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పసుపు రైతులు సుదీర్ఘ కాల పోరాటం వల్లనే పసుపుబోర్డు నిజామాబాద్ లో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ బోర్డు వల్ల రైతులకు కలిగే ప్రయోజనాలు ఏ విధంగా ఉంటాయో వివరించాల్సిన అవసరం ఉంటుందన్నారు. ఆర్మూర్ రెవెన్యూ డివిజన్ మండలాల్లో పసుపు పంటను అధికంగా సాగుచేస్తున్నందున వేల్పూర్ మండలం అక్లూర్ గ్రామ సమీపంలో బీఆర్ఎస్ హయాంలో 42ఎకరాలలో టర్మరిక్ స్పైస్ పార్క్ లో పసుపు ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేయాలన్నారు. పసుపుకు డిమాండ్ పెరిగే విధంగా చూసే బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని పేర్కొన్నారు.

దర్జాగా పేకాట

● పోలీసులకు అందుతున్న నెలనెలా మామూళ్లు
● ముఠాలుగా ఏర్పడి కేటీ కిరాయి తీస్తున్న పేకాట రాయుళ్లు
● విజిలెన్స్, టాస్క్‌ఫోర్సు వారంటే వారికి షరా మామూలే

నసురుల్లాబాద్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతో పాటు మైలారం, లింగంపల్లి తండా, హాజీపూర్, సంఘం గ్రామాల్లో పేకాటకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. పేకాటరాయులకు నసురుల్లాబాద్ మండలంలో పత్తలాడితే ఎలాంటి ఢోకా ఉండదని తమ దిన చర్యకు ఆటంకాలు రావని ఒక భరోసా ప్రతీ నిత్యం నసురుల్లాబాద్ మండలంలోని పలు గ్రామాల్లో అడవి ప్రాంతాలను ఆసరాగా చేసుకుని అడ్డాలను మారుస్తూ తమ పేకాటను పేకాట రాయుళ్లు దర్జాగా కొనసాగిస్తున్నారు. పేకాటరాయుళ్లకు ఫోన్లు చేసి మరీ రప్పించుకొని పేకాట కేంద్రాలను నిర్వహిస్తున్న నిర్వాహకులు పేకాటను అలవోకగా ఆడిస్తున్నట్లు సమాచారం. సుమారు ఒక్కరోజు లక్షల రూపాయల్లో టర్నోవర్ చేస్తూ పేకాటాడే వారి జీవితాలను బుగ్గిపాలు చేస్తున్నారు. దీనిలో ఆట ఆడించేవారు రోజుకు రూ.20 వేల నుంచి రూ.30 వేలు కేటీ కిరాయి తీస్తూ పబ్బం గడుపుకుంటున్నారు. దీనికోసం నెల నెలా పోలీసులకు మామూలు ముట్ట చెబుతున్నారని నసురుల్లాబాద్ మండలంలో ప్రచారం జోరుగా కొనసాగుతుంది. ఒక తరహాలో విజిలెన్స్, టాస్క్‌ఫోర్సు స్పెషల్ బ్రాంచ్ పోలీసులు పేకాట స్థావరాలపై దాడులు చేసేందుకు వస్తున్నారని తెలిసిన మరుక్షణమే అదురు బెదురు లేకుండా తమకేం కాదు అన్నట్లుగా దర్జాగా పతలాటను కొనసాగి స్తున్నారు. ఇది ఏమిటని ఆరా తీస్తే ఇంటలిజెన్స్, టాస్క్‌ఫోర్సు, విజిలెన్స్ పోలీసు లకు స్థానిక పోలీసులే తప్పుదోవ పట్టిస్తూ పేకాట స్థావరాలను కంటికి రెప్పల కాపాడుకుంటున్నారని విమర్శలు మండలంలో చక్కర్లు కొడుతున్నాయి. గతంలో మండలంలో ఇలాంటి తతంగమే కొనసాగిందని, దీంతో అప్పట్లో ఆంధ్రజ్యోతి పత్రిక అడవిలో పేకాట అనే వార్త ప్రచురితమైతే అప్పటి ఎస్పీ స్పందించి స్థానిక పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేసి పేకాట నివారణపై ఉక్కుపాదం మోపారు. ప్రస్తుతం మండలంలో మళ్లీ పాత రోజులే కొనసాగుతున్నట్లుగా పత్తలాట మరి జోరందుకుంది.. పేకాట ఆడడానికి వస్తున్న వారి కుటుంబాలు, తమ బతుకులు ఛిత్రం అవుతున్నాయని, తమ కుటుంబాలు రోడ్డున పడుతున్నా పోలీసులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు సైతం మండలంలోని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు స్పందించి పేకాట స్థావరాలను నడిపిస్తున్న పేకాటరాయుళ్ల ఆట కట్టించి పత్తా లాటని జాడ లేకుండా చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబాలు మొర పెట్టుకుంటున్నారు.

● పేకాట ఆడే వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదు



నసురుల్లాబాద్ మండలంలో పేకాట ఆడుతున్న వారు ఎంతటి వారైనా ఉపేక్షిం చేది లేదని ఎస్సై లావణ్య అన్నారు. ఈ విషయమై ఆంధ్రజ్యోతి వివరణ కోరగా నసురుల్లాబాద్ మండలంలో పేకాట ఆడుతున్నట్లు తమకు సమాచారం లేదని, అలాంటి సమాచారం ఎవరు ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని ఆమె తెలిపారు.. - లావణ్య, ఎస్ఐ, నసురుల్లాబాద్

సమస్యల వలయంలో సిర్నాపల్లి

● ఎక్కడి సమస్యలు అక్కడే
● ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్న గ్రామస్థులు



గ్రామ పంచాయతీ కార్యాలయం

ఇందల్వాయి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిర్నాపల్లి ఓ మారుమూల గ్రామం. ఒకప్పుడు మావోయిస్టు ప్రాబల్యం ఉన్న గ్రామాల్లో ప్రధానమైనవి. సిర్నాపల్లి గ్రామాన్ని శీలం జానకీబాయి పరిపాలించిన గ్రామం. ఆ గ్రామం నేడు సమస్యలతో కొట్టుమిట్టాడుతుంది. గ్రామంలో ప్రధాన రోడ్లు, పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత, సీసీ రోడ్ల నిర్మాణం, శిథిలావస్థకు చేరిన పశువైద్యశాల, ఆర్అండ్‌బీ రోడ్ల బ్రిడ్జి నిర్మాణం లేక అభివృద్ధికి నోచుకోక ఎక్కడి సమస్యలు అక్కడే దర్శనమిస్తున్నాయి.

సిర్నాపల్లి నుంచి కామారెడ్డి వరకు రోడ్డు నిర్మాణం

సిర్నాపల్లి గ్రామస్థులు వివిధ అవసరాల కోసం 35 కిలోమీటర్ల దూరంలో గల నిజామాబాద్ జిల్లా కేంద్రానికి వస్తుంటారు. సిర్నాపల్లి నుంచి గిద్దె, ఉప్పల్వాయి మీదుగా కామారెడ్డి వరకు గతంలో కాలిబాట ఉండేది. ఆ బాట వెంట బైకుల ద్వారా వివిధ పనుల కోసం గ్రామస్థులు కామారెడ్డికి వస్తూ పోతుంటారు. ఆ రోడ్డు బాగా లేక రాళ్లు, రప్పలు, గుంతలతో కూడిన రోడ్డు మార్గాన కామారెడ్డికి వెళ్లాలంటే గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సిర్నాపల్లి నుంచి గిద్దె మీదుగా కామారెడ్డి వరకు రోడ్డు నిర్మాణం చేపడితే అర గంటలో కామారెడ్డికి చేరుకునే అవకాశం ఉంది. ఈ రహదారి మొత్తం అటవీ ప్రాంతంలో ఉండటంతో రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి సహకారంతో రెండు కల్వర్టు పనులు పూర్తికాగా మిగతా పనులు నిధులలేమితో రోడ్డు పనులు నిలిచిపోయాయి. గతంలో ప్రజాప్రతినిధులకు విన్నవించిన పట్టించుకోలేదు.



సిర్నాపల్లి గ్రామంలో మట్టిరోడ్డు

బుగ్గవాగు బ్రిడ్జి నిర్మాణం

ఊరు చివరన నెలకొల్పిన స్మశాన వాటికకు వెళ్లాలంటే బుగ్గవాగు దాటి వెళ్లాల్సిందే. గ్రామంలో ఎవరు చనిపోయిన శవపేటికను స్మశాన వాటికలో దహన సంస్కరాలు చేయాల్సి ఉంటుంది. వర్షాకాలంలో ఎవరైనా చనిపోతే శవపేటికను బుగ్గవాగు దాటి స్మశాన వాటికలో దహన సంస్కరాలు చేయడానికి గ్రామస్తులు నానా తంటాలు పడుతుంటారు.

సీసీ రోడ్ల నిర్మాణం

గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణం నేటికి పూర్తికాలేదు. చాలా వార్డులలో ఇంకా సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాల్సిన అవసరం ఉంది. ఇందిరమ్మ కాలనీ నుంచి గాంధీ విగ్రహం వరకు వాటర్‌ఫాల్స్ వెళ్లే మార్గంలో తారు రోడ్డు నిర్మాణం, కొయ్యల గేటు నిర్మాణం లేకపోవడంతో వ్యవసాయ రైతులు పొలం వద్దకు వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారు. శీలం జానకీబాయి విగ్రహాలకు వెళ్లే దారిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ముందు సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టవల్సి ఉంది. స్కూల్‌లో టీచర్ల కొరత ఉండటంతో విద్యా వలంటీర్లను ఉపయోగించి విద్యా బోధన కొనసాగిస్తున్నారు.

శిథిలావస్థకు చేరిన పశు వైద్యశాల

ప్రతిరోజు మూగజీవాలకు వైద్యం అందించే పశు వైద్యశాల ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. స్లాబ్ పైకప్పు పెచ్చులు ఊడటంతో ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో వైద్యం అందిస్తున్న డాక్టర్లు జంకుతున్నారు.

ఆర్అండ్‌బీ రోడ్డు బ్రిడ్జి నిర్మాణం

నిజామాబాద్ నుంచి సిర్నాపల్లికి వెళ్లాలంటే ఒకేఒక్క మార్గం ఆర్అండ్‌బీ రోడ్డు. ఆ రోడ్డు ద్వారానే బస్సులు, బైకులు, ఆటోలు ఇతర ప్రాంతాలకు వెళ్తుంటాయి. ఊరు చివరన ఉన్న ఆర్అండ్‌బీ రోడ్డు బ్రిడ్జి తక్కువ ఎత్తులో ఉండటంతో వర్షాకాలం వరద ఉధృతి బ్రిడ్జిపై నుంచి వరద నీరు పొంగి పొర్లడంతో రాకపోకలు స్థంభించిపోతున్నాయి. ఎక్కడ వానలు అక్కడే నిలిచిపోవడంతో గ్రామస్థులు ఇతర గ్రామాలకు వెళ్లకుండా ఇబ్బందులు పడుతున్నారు. వివిధ రకాల సమస్యలతో ఎదుర్కొంటున్న సిర్నాపల్లి గ్రామాన్ని ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకొని అన్ని విధాల అభివృద్ధి చేయాలని గ్రామస్థులు వేడుకుంటున్నారు.



శిథిలావస్థకు చేరిన పశు వైద్యశాల

గ్రామంలో అన్నీ సమస్యలే..

● సొప్పరి నర్సయ్య, గ్రామస్థుడు



గ్రామంలో అన్నీ సమస్యలే దర్శనమిస్తున్నాయి. చాలా వార్డుల్లో సీసీ రోడ్లు లేవు. వర్షా కాలం వస్తే అంతే సంగతులు. బుగ్గవాగు నిర్మాణం, పశు వైద్యశాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి. అధికారులు స్పందించి గ్రామ సమస్యలు తీర్చాలి.

గిద్దె రోడ్డు పూర్తి చేయాలి..

● టేక్మాల్ పురేందర్, గ్రామస్థుడు



సిర్నాపల్లి నుంచి కామారెడ్డికి వెళ్లడానికి తారు రోడ్డు, ఆర్అండ్‌బీ రోడ్డు బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి. సిర్నాపల్లికి రావడానికి రహదారి లేక వాహనదారులకు తిప్పలు తప్పడం లేదు. సిర్నాపల్లి గ్రామాన్ని దత్తత తీసుకొని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలని అధికారులను కోరుతున్నా.

భారంగా మారిన రైతు వేదికల నిర్వహణ

● నిధులు లేక ఇబ్బందులు పడుతున్న ఏఈవోలు



చెట్లతో నిండిపోయిన రైతు వేదిక

మద్నూర్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లాలో భౌగోళికంగా వ్యవసాయ వనరులు పుష్కలంగా ఉండడంతో వ్యవసాయ రంగంలో రైతులను చైతన్యవంతం చేసేందుకు నూతన పద్ధతుల్లో సాగు చేయడంలో నైపుణ్యం పెంచేందుకు రైతు వేదికలను గత ప్రభుత్వం నిర్మించింది. ఐదు వేల మంది రైతులకు ఒక క్లస్టర్ ఏర్పాటు చేసింది. ఒక్కో క్లస్టర్‌లో ఒక రైతు వేదిక నిర్మించింది. వీటిల్లో రైతులతో సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నారు. రైతు వేదికలలో పంటల సాగులో అనుసరించాల్సిన కొత్త విధానాలను రైతులకు వివరిస్తున్నారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో వ్యవసాయ విస్తీర్ణ అధికారులకు నిర్వహణ భారంగా మారింది. 2002-23 ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు ఐదు నెలలకు గాను రూ.9వేల చొప్పున రూ.45 వేలు ప్రభుత్వం విడుదల చేసింది. ఆ తర్వాత నిధులు మంజూరుకు నోచుకోకపోవడంతో ఏఈఓలు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో 104 క్లస్టర్లను ఏర్పాటు చేసింది. ఒక్కో క్లస్టర్‌కు ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద పది లక్షలు, వ్యవసాయ శాఖ నిధులు రూ.12లక్షల చొప్పున రూ.22 లక్షలను ఖర్చు చేసి క్లస్టర్‌ను ఏర్పాటు చేశారు. ప్రతీ రైతువేదికలో సమావేశాలు నిర్వహించుకునేందుకు కుర్చీలు తదితర సామగ్రి సమకూర్చారు. వ్యవసాయ విశ్వ విద్యాలయం నుంచి శాస్త్రవేత్తలు రైతుల సందేహాలను నివృత్తి చేసేందుకు అన్నదాతలతో మాట్లాడేందుకు వీలుగా ఆయా రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ సదుపాయం కల్పించారు. మండల కేంద్రానికి ఒకటి చొప్పున వీసీ సదుపాయం ఉంది. చాలా క్లస్టర్లలో రైతు వేదికలు గ్రామాలకు దూరంగా నిర్మించారు. మహిళా ఏఈవోలు ఈ వేదికలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాలకు దూరంగా ఉన్న రైతు వేదికల్లో ఏర్పాటు చేసిన వీసీ పరికరాలు ఫర్నిచర్‌కు భద్రత కరువైంది. ఏఈవోలు నిత్యం వేదికలు శుభ్రం చేసేందుకు స్వీపర్లను నియమించుకున్నారు. ప్రతీనెల స్వీపర్లకు జీతభత్యాలు చెల్లించాల్సి ఉంటుంది. నిధులు రాకపోవడంతో పనిచేసేందుకు ఆసక్తి చూపడం లేదు. ఇంటర్నెట్ కనెక్షన్లు ఇవ్వలేదు. ప్రతీ నెల విద్యుత్ బిల్లులు వస్తున్నాయి. వీటిని చెల్లించే నిధులు లేక విద్యుత్తు సిబ్బందికి ముఖం చాటేస్తున్నారు. ట్రాన్స్‌కో అధికారులు కనెక్షన్లను కట్ చేస్తామని అంటున్నప్పటికీ ఉన్నతాధికారులు సర్ది చెప్పుకొస్తున్నారు.

● ఖర్చుల భారం ఏఈవోలపైనే

సమావేశాలు నిర్వహించే సమయాల్లో టీ, బిస్కెట్లు ఖర్చులు ఏఈవోలు భరిస్తున్నారు. ప్రతీ మంగళవారం రైతు నేస్తం కార్యక్రమం నిర్వ హిస్తున్నారు. వీటికి హాజరయ్యే రైతులకు మంచినీరు అందించాలన్న భారం పడుతుంది. ఈ వేదికల్లో టాయిలెట్లు లేకపోవడంతో మహిళా ఏఈఓలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని వేదికల్లో ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు పనిచేయడం లేదు. చుటూ పెన్సింగ్ లేకపోవడంతో మందుబాబులకు అడ్డాగా మారుతున్నాయి.

నిర్మించారు .. వదిలేశారు

డిచ్‌పల్లి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : గత ఎనిమిదేళ్లుగా మండలంలోని ఘన్ పూర్ వైకుంఠధామం అసంపూర్తిగా నిర్మాణం వదిలేయడంతో గ్రామస్థులకు వాడుకలోకి రాకుండా పోయింది. లక్షల రూపాయలతో నిర్మించిన స్నానాల గదుల తలుపులు దొంగలు పగలగొట్టి ఎత్తికెళ్లారు. విలువైన బోరు మోటారు చోరీయ కావడంతో చుక్క నీరు లేక గ్రామస్థులు చివరి మజిలి కార్యక్రమంలో ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు ఇప్పటికైన పూర్తి స్థాయిలో వైకుంఠధామం నిర్మించి వాడుకలోకి తీసుకురావలని కోరుతున్నారు.



ప్రారంభోత్సవానికి నోచుకోని వైకుంఠధామం



బోరు మోటారు ఎత్తుకెళ్లిన దృశ్యం



ధ్వంసమైన తలుపులు



అలంకారప్రాయంగా మారిన స్నానాల గదులు

ఎల్లారెడ్డిలో ముగిసిన కబడ్డీ టోర్నమెంట్

● మొదటి విజేతగా హాజీపూర్ తండా జట్టు

ఎల్లారెడ్డి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం పక్కన సత్యం టౌన్‌షిప్‌లో సంక్రాంతి పండుగ సందర్భంగా ఎమ్మెల్యే ఆదేశాల మేరకు మాజీ మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ ఆధ్వర్యంలో గత రెండు రోజుల నుంచి నిర్వహిస్తున్న కబడ్డీ పోటీలు శుక్రవారం ముగిసాయి. ఈ పోటీల్లో మొదటి విజేతగా హాజీపూర్ తండా కబడ్డీ జట్టు విజేతగా నిలిచి రూ. 51 వేలు, రెండో విజేతగా ఎల్లారెడ్డి టీమ్ రూ.21 వేలు, మూడో విజేతగా భిక్కనూర్, మాచాపూర్ జట్లకు రూ.11 వేల నగదు బహుమతి గెలుచుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నె ప్రభాకర్, సీఐ రవీందర్ నాయక్, ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకులు సిద్దు, మార్కెట్ కమిటీ చైర్మన్ రజితారెడ్డి, నాయకులు ప్రశాంత్‌గౌడ్, సామెల్, జక్కుల సంతోష్, వ్యాయామ ఉపాధ్యాయులు అతిక్ ఉల్లా తదితరులు క్రీడలను వీక్షించి అభినందించారు.



కబడ్డీ పోటీల్లో రూ.51 వేలు గెలుచుకున్న క్రీడాకారులు

క్రికెట్ టోర్నీ విజేతగా బాబాపూర్ జట్టు

భీమ్‌గల్ రూరల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పురాణిపేట్ గ్రామంలో గత వారం రోజులుగా నుంచి నిర్వహిస్తున్న కస్తూరి రాజుబాయి స్మారక క్రికెట్ టోర్నమెంట్ శుక్రవారం ముగిసింది. ఫైనల్‌లో బాబాపూర్, పురాణిపేట్ జట్టు తలపడగా విన్నర్‌గా బాబాపూర్ జట్టు, రన్నర్ అప్‌గా పురాణిపేట్ నిలిచాయి. మొదటి ల్యాటింగ్ చేసిన బాబాపూర్ జట్టు నిర్దేశించిన 52 పరుగుల ఆరు ఓవర్‌లలో టార్గెట్‌ని పురాణిపేట్ జట్టు ఒక్క పరుగు వెనుకబడి విజయ అవకాశాన్ని కోల్పోయారు. అనంతరం విజేతలకు ట్రోఫీ ప్రైజ్‌మనీ రూ.10వేలు, రన్నర్ అప్‌గా నిలిచిన పురాణిపేట్ జట్టుకు రూ.7వేలు మేనేజ్‌మెంట్, గ్రామస్థులు అందజేసి క్రీడాకారులను అభినందించారు.



బాబాపూర్ జట్టుకు షీల్డ్ అందజేస్తున్న దృశ్యం



మహాగణపతి ఆలయంలోని గణపతి విగ్రహం



సామూహిక సంకష్ట చతుర్థి పూజలు

గణపతి ఆలయాల్లో సామూహిక సంకష్ట చతుర్థి పూజలు

నిజామాబాద్ కల్చరల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): గణనాథునికి ప్రీతికరమైన చతుర్థి పూజలను శుక్రవారం గణపతి ఆలయాల్లో ఘనంగా నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా ఆలయాల్లో గణపతికి గణపతి అథర్వన శీర్షంతో అభిషేకాలు, ప్రత్యేక గరిక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయాల్లో సామూహిక సంకష్ట చతుర్థి పూజలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేశారు. జిల్లా కేంద్రంలోని సార్వ జానిక్ గణపతి ఆలయంలో నిర్వహించిన చతుర్థి పూజలో భక్తులు గణనాథునికి విశేష పూజలు నిర్వహించి ఆలయంలో జరిగిన సామూహిక సంకష్ట చతుర్థి పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏలేటి పశుపతిశర్మ వేదమంత్రాలు పఠిం చగా భక్తులు పూజలు చేశారు.

వన మహోత్సవానికి ఏర్పాట్లు

● కోటగిరి ఉమ్మడి మండలంలో 2.24లక్షల మొక్కల లక్ష్యం



నర్సరీలకు మట్టి తరలిస్తున్న దృశ్యం

కోటగిరి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో హరితహారంలో భాగంగా మొక్కలు పెంచేందుకు అధికారులు ప్రణాళికలు పూర్తి చేశారు. ప్రతీ గ్రామ పంచాయతీల్లోని పల్లె నర్సరీల్లో జనాభా ప్రతిపాదికన మొక్కలు పెంచేలా చర్యలు తీసుకుంటున్నారు. ఉమ్మడి కోటగిరి మండలంలో 28 గ్రామ పంచాయతీలు ఉండగా ప్రతి గ్రామ పంచాయతీకి 8వేల మొక్కల చొప్పున 2.24లక్షల మొక్కల పెంపకం చేపట్టనున్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఆధ్వర్యంలో పల్లె నర్సరీల నిర్వహణ కొనసాగుతుంది. అధికారులు ఉపాధి హామీ కూలీల చేత ప్లాస్టిక్ సంచుల్లో మట్టి నింపించడం, అందులో విత్తనాలు పెట్టించడం వంటి పనులు కొనసాగిస్తున్నారు.

● నర్సరీల్లో మూడు రకాల మొక్కల పెంపకానికి ప్రాధాన్యత

వివిధ ప్రాంతాల్లోని గ్రామ పంచాయతీల్లో ఉన్న నర్సరీల్లో పూలు, పండ్లు, నీడ నిచ్చే మొక్కలు పెంచేందుకు అధికార యంత్రాంగం సిద్ధమవుతోంది. వన మహోత్సవంలో భాగంగా వచ్చే వానాకాలంలో ఇంటింటికి పూలు, పండ్ల మొక్కలను పంపిణీ చేస్తామని అధికారులు తెలిపారు. నీడను ఇచ్చే మొక్కలను అవెన్యూ ప్లాంటేషన్, రహదారులు, ప్రభుత్వ కార్యాలయాలు, ఖాళీ స్థలాల్లో నాటుతామని అధికారులు పేర్కొంటున్నారు.

● గతంలో 10వేల నుంచి ప్రస్తుతం 8వేలకు పరిమితం

గత ఏడాది ప్రభుత్వం వన మహోత్సవంలో భాగంగా ప్రతి గ్రామ పంచాయతీ నర్సరీల్లో 10వేలకు పైగా మొక్కలను పెంచడానికి లక్ష్యం నిర్ధేశించుకుంది. గత ఏడాది నర్సరీల్లో పెంచిన మొక్కలను ఆయా ప్రాంతాలకు తరలించగా మిగిలిపోయిన మొక్కలు వృథా అయ్యాయి. ఆ స్థానంలో ప్రతీ గ్రామ పంచాయతీలో రెండు వేల మొక్కల పెంపకాన్ని తగ్గించి 8వేలకు పరిమితం చేశారు. ప్రస్తుతం ఆయా నర్సరీలలో గత ఏడాది మొక్కలు అలాగే దర్శనమిస్తున్నాయి. ఈ ఏడాదైనా నర్సరీల్లో పెంచిన మొక్కలను లక్ష్యం మేర పంపిణీ చేసేలా అధికార యంత్రాంగం దృష్టి సారిస్తే మేలని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేశారు.

నిర్దేశించిన లక్ష్యం మేర మొక్కలు పెంచుతాం

● గంగారాం, ఏపీవో, కోటగిరి



ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు ఉమ్మడి మండలంలో 2. 24లక్షల మొక్కలను పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నాం. వచ్చే వానాకాలంలో నిర్వహించే వన మహోత్సవం కార్యక్రమానికి మొక్కలను సిద్ధం చేస్తాం.



జల్లాపల్లిలో బ్యాగుల్లో మట్టి నింపుతున్న దృశ్యం



మట్టిలో ఎరువు కలుపుతున్న దృశ్యం



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్

డ్రైనేజీ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

సుభాష్‌నగర్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులు నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కాంట్రాక్టర్లను, అధికారులను ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని 35, 36, 37, 43 డివిజన్‌లలో పలు అభివృద్ధి కార్యక్రమాలను నగర మేయర్ దండు నీతూకిరణ్‌తో కలిసి ప్రారంభించారు. నగరంలోని శివాజీనగర్, జైన్‌మందిర్, చత్రపతి హనుమాన్ మందిర్, అంబేద్కర్ కాలనీ ప్రాంతాల్లో వివిధ పనులకు భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 14వ ఫైనాన్స్ ద్వారా ప్రతి డివిజన్‌కు రూ.10లక్షలు మంజూరయ్యాయన్నారు. అందులో భాగంగా నగరంలోని పలు డివిజన్‌లలో సీసీరోడ్డు, డ్రైనేజీ నిర్మాణం పనులకు శంకుస్థాపన చేశామన్నారు. నిజామాబాద్ నగరం అభివృద్ధే లక్ష్యంగా నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు వంద కోట్లు మంజూరు చేయాలని ఇన్‌చార్జి మంత్రి జూపల్లికి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామమన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ దండు నీతూకిరణ్, కార్పొరేటర్లు ఎర్రం సుదీర్, మాస్టర్ శంకర్, ఉమారాణి, స్రవంతిరెడ్డి, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీలో కొండాపూర్ జట్టు విజేత



విజేతలకు మెమోంటో ప్రదానం చేస్తున్న నాయకులు

సిరికొండ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): అమరవీరుల స్మారకార్థం నిర్వహించిన జిల్లాస్థాయి వాలీబాల్, కబడ్డీ క్రీడా పోటీల్లో.. వాలీబాల్ పోటీలో కొండాపూర్, కబడ్డీలో మూషీర్‌నగర్ జట్లు విజేతలుగా నిలిచాయి. విజేతలకు ముఖ్య అతిథులుగా హాజరైన సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యుడు ప్రభాకర్ బహుమతి ప్రదానం చేశారు. వాలీబాల్ క్రీడలో మొదటి బహుమతిని గెలుచుకున్న కొండాపూర్ క్రీడాకారులకు పదివేల నగదు, ద్వితీయ విజేతలైన పడకల్ తండా జట్టుకు ఐదువేల నగదు, కబడ్డీలో ప్రథమ విజేత మూషీర్‌నగర్ క్రీడాకారులకు ఐదువేల నగదు, ద్వితీయ విజేత చీమన్‌పల్లి జట్టుకు మూడు వేల నగదు బహుమతితో పాటు మెమోంటోలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాస్‌లైన్ రాష్ట్ర నాయకులు రామకృష్ణ, డివిన్ కార్యదర్శి దేవరాం, ముత్తెన్న, కెం.గంగాధర్, సురేష్, ఎన్ఆర్ఐ శ్రీనివాస్, తిరుమల, ఆర్.రమేష్, సత్తెవ్వ, రమ పాల్గొన్నారు.

విద్యుత్ తీగలు తగిలి బాలుడికి గాయాలు

ఖిల్లా, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): గాలి పటం కోసం వెళ్లిన పదేళ్ల బాలుడికి ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగిలి తీవ్ర గాయాలైన ఘటన శుక్రవారం జిల్లాకేంద్రంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. నగరంలోని వినాయక్‌నగర్‌కు చెందిన షేక్ జీశాంత్ ఓ ప్రయివేటు పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్నాడు. తనింటి పక్కనే గల ఓ బంగ్లాపైకి జీశాంత్ శుక్రవారం గాలిపటం ఎగరవేసేందుకు వెళ్లాడు. ఈ సమయంలో విద్యుత్ తీగలకు తట్టుకున్న గాలిపటాన్ని తీసేందుకు జీశాంత్ ప్రయత్నించగా.. ఒక్కసారిగా కరెంటు షాక్‌కు గురయ్యాడు. ఈ ఘటనలో బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబీకులు వెంటనే జీశాంత్‌ను చికిత్స నిమిత్తం నగరంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. కాగా.. సమాచారం అందుకున్న నగర నాలుగో టౌన్ ఎస్సై శ్రీకాంత్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాలుడి తండ్రి షేక్ షబ్బీర్ ఫిర్యాదు మేరకు కేసు విచారిస్తున్నట్టు తెలిపారు.

విలీన సభను జయప్రదం చేయాలి

నిజామాబాద్ అర్బన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): రెండు అఖిల భారత రైతు కూలీ సంఘాలు ఏఐకేఎంఎస్ విలీన సభ ఈనెల 19న మహబూబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్నందున రైతుకూలీ సంఘం కార్యకర్తలు, రైతులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వేల్పూర్ భూమయ్య తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ద్వారకనగర్‌లో ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగంపై నిర్లక్ష్య వైఖరి కారణంగా వ్యవసాయరంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోతున్న సమయంలో దేశంలోని రెండు అఖిలభారత రైతుకూలీ సంఘాలు విలీనమై రైతాంగ ఉద్యమాలను రూపొందించుకోవడానికి విలీనసభ నిర్వహిస్తుందన్నారు. సభను విజయవంతం చేయడానికి రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు సాయరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

సిరికొండ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామడుగు-హుస్సేన్‌నగర్ గ్రామాల మధ్య దాచిన పీడీఎస్ బియ్యాన్ని ఎస్సై ఎల్.రామ్ శుక్రవారం పట్టుకుని పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఫైజల్ లనే వ్యక్తి బియ్యాన్ని దాచారని తమకు అందించిన సమాచారంతో సిబ్బందితో వెళ్లి పరిశీలించగా 40 బస్తాల బియ్యం లభించిందని ఎస్సై ఎల్ రామ్ తెలిపారు.

టీయూలో నూతన నియామకం

డిచ్‌పల్లి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ యూనివర్సిటీ ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ విభాగాధిపతిగా డా.సత్యనారాయణ రెడ్డిని నియమిస్తూ శుక్రవారం వీసీ యాదగిరిరావు ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. సత్యనారాయణ రెడ్డి జవహర్ లాల్ నెహ్రూ యూనివర్సిటీ ఢిల్లీ నుంచి పీహెచ్‌డీ కోసం మధుమేహం నివారణపై జరిపిన పరిశోధనలు గుర్తించదగినవని పేర్కొన్నారు. ప్రస్తుతం వర్సిటీ వైస్ ప్రిన్సిపాల్‌గా ఉన్న సత్యనారాయణ రెడ్డి గతంలో అడిషనల్ కంట్రోలర్, పబ్లికేషన్ సెల్ డైరెక్టర్, ఇక్వాల్ ఆపర్చునిటి సెల్ డైరెక్టర్‌గా విధులు నిర్వహించి ఉన్నతాధికారుల మన్ననలను పొందారని అన్నారు. తనపై నమ్మకంతో విభాగాధిపతిగా నియమించిన వీసీ యాదగిరి రావు, రిజిస్ట్రార్ యాదగిరికి సత్యనారాయణ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

నేడు ధర్మారం(బి)లో ఎన్టీఆర్ కాంస్య విగ్రహ ఆవిష్కరణ

డిచ్‌పల్లి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): తెలుగు దేశం పార్టీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారకరామారావు కాంస్య విగ్రహ పునర్నిర్మాణ కార్యక్రమాన్ని శనివారం మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు ధర్మారం(బి) పంచాయతీ ఆవరణలో నిర్వహించనున్నారని గ్రామ పంచాయతీ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా విగ్రహ ఆవిష్కరణతో పాటు పలు సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమానికి ఎన్టీఆర్ అభిమానులు, టీడీపీ నాయకులు తరలిరావాలని కోరారు.

నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడపొద్దు

● ట్రాఫిక్ ఏసీపీ నారాయణ

ఖిల్లా, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): వాహనాలు నడిపే సమయంలో ట్రాఫిక్ నిబంధనలు తప్పకుండా పాటించాలని, త్రిబుల్‌రైడింగ్ వెళ్లరాదని ట్రాఫిక్ ఏసీపీ నారాయణ అన్నారు. జిల్లా కేంద్రంలోని వినాయక్‌నగర్‌లో గల ఓ మాల్‌లో పని చేస్తున్న సిబ్బందికి ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి పలు సూచనలు చేశారు. చిన్నపిల్లలకు వాహనాలు ఇవ్వరాదని, మద్యం తాగి వాహనం నడపడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలుంటాయన్నారు. సెల్‌ఫోన్ మాట్లాడుతే వాహనం నడిపితే ఎదురుగా వచ్చే వాహనదారులను గుర్తించలేకపోతారన్నారు. దీంతో ప్రమాదాలబారిన పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, ట్రాఫిక్ ఎస్ఐలు చంద్రమోహన్, సిబ్బందితోపాటు మాల్‌లో పనిచేసే సిబ్బంది పాల్గొన్నారు.



త్రిబుల్ రైడింగ్‌పై అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ

ట్రాఫిక్ నియంత్రణకు బారికేడ్ల ఏర్పాటు

జిల్లా కేంద్రంలో ప్రధాన కూడళ్ల వద్ద ట్రాఫిక్ నియంత్రణకు బారికేడ్లను ఏర్పాటు చేయనున్నట్లు ట్రాఫిక్ ఏసీపీ నారాయణ తెలిపారు. జిల్లా కేంద్రంలోని మెడికవర్ ఆస్పత్రి ద్వారా సుమారు 50 బారికేడ్లను ట్రాఫిక్ ఏసీపీకి అందించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. రోడ్డుపై అవసరమున్న చోట బారికేడ్లు ఏర్పాటు చేయడం వల్ల వాహనదారులు వేగాన్ని తగ్గించి ప్రమాదాలను నియంత్రించుకునే అవకాశాలుంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, ట్రాఫిక్ ఎస్ఐ చంద్రమోహన్, మెడికవర్ ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.



పోలీసులకు బారికేడ్‌లను అందజేస్తున్న ఆస్పత్రి సిబ్బంది

జాతీయ స్థాయి పోటీలకు జిల్లా క్రీడాకారులు

సుభాష్‌నగర్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎంపికైనట్లు జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మానస గణేష్, శ్యామ్‌లు తెలిపారు. తెలంగాణ జట్టు తరఫున వీరు 62వ జాతీయ స్థాయి జూనియర్ బాల్‌బ్యాడ్మింటన్ పోటీలో పాల్గొననున్నారని తెలిపారు. ఈ పోటీలలో సాయిశివ, పండరి, స్ఫూర్తిలు ఎంపికయ్యారని తెలిపారు. వీరు మహారాష్ట్రంలోని నాగ్‌పూర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలో పాల్గొంటారని తెలిపారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల ఉపాధ్యక్షులు కిశోర్, కిషన్, రంజిత్, నర్సయ్య, రాజ్‌కుమార్, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు విద్యాసాగర్‌రెడ్డి, మల్లేష్‌గౌడ్, కోశాధికారి రాజేశ్వర్, క్రీడా అభిమానులు హర్షం వ్యక్తం చేశారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నీకి ఎస్ఎస్ఆర్ విద్యార్థి

నిజామాబాద్ అర్బన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): చెన్నైలో జరగనున్న సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌కు జిల్లాకు చెందిన ఎస్ఎస్ఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థి అఖిల్ ఎంపికయ్యాడు. అఖిల్ ఎస్ఎంఆర్ మెమోరియల్ టోర్నమెంట్, అండర్-16 హెచ్‌సీఏ, అండర్-19 నిజామాబాద్, అండర్-19 ఎస్‌జీఎఫ్ క్రికెట్ పోటీలలో ఉత్తమ ప్రతిభను కనబర్చాడు. సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు ఎంపికైన అఖిల్‌ను ఎస్ఎస్ఆర్ విద్యాసంస్థల చైర్మన్ మారయ్యగౌడ్ అభినందించారు. క్రికెట్‌లో ఉత్తమ ప్రతిభకనబర్చి దేశానికి ప్రాతినిధ్యం వహించాలని ఆయన ఆకాంక్షించారు.

కాంగ్రెస్‌లో అధికారంలో ఉండగా పసుపు బోర్డు ఎందుకు తీసుకురాలేదు

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్

నిజామాబాద్ అర్బన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ కేంద్రంలో అధికారంలో ఉండగా పసుపు బోర్డును ఎందుకు తీసుకురాలేదని దీనికి రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి సమాధానం చెప్పాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్‌కులాచారి ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన ఒక పత్రిక ప్రకటనలో విడుదల చేశారు. ఇందూరు పసుపు రైతులు నాలుగు దశాబ్దాలుగా పోరాటం చేస్తున్న పసుపు బోర్డును కేంద్ర ప్రభుత్వం, ప్రధాని నరేంద్రమోదీ సంక్రాంతి కానుకగా ఏర్పాటు చేస్తే కాంగ్రెస్ నేతలు తమను పిలవలేదని అనడం సరికాదన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు మాత్రమే వేదికపై పాల్గొన్నారని కాంగ్రెస్ వారి లాగా అధికార కార్యక్రమాల్లో బీజేపీ కార్యకర్తలు పాల్గొనలేదన్నారు. పసుపు బోర్డు ఏర్పాటులో తుమ్మల నాగేశ్వర్‌రావు పాత్ర ఏమిటో భూపతిరెడ్డి చెప్పాలని ఆయన ప్రశ్నించారు. కేంద్ర మంత్రి పీయూష్‌గోయల్, ఎంపీ అర్వింద్‌లు పసుపు బోర్డు ఏర్పాటులో కీలకపాత్ర పోషించారని అన్నారు.

దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి

● జిల్లా మలేరియా అధికారి

డిచ్‌పల్లి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మారం(బి)లో శుక్రవారం ఫ్రైడే-డ్రైడే కార్యక్రమాన్ని జిల్లా మలేరియా అధికారి రాథోడ్ తుకారం ఆకస్మికంగా పరిశీలించారు. దోమల వల్ల కలిగే వ్యాధులు మలేరియా, డెంగ్యూ, చికున్ గున్యా వ్యాధులను తరిమికొట్టాలని దోమల ఆర్వ పెరగకుండా చూడాలని నీటి నిల్వ ప్రాంతాలు గుర్తించి స్థానిక కార్యదర్శి బాలక్రిష్ణకు నివేదిక అందించాలని ఆరోగ్య విస్తీర్ణాధికారి శంకర్‌కు ఆదేశించారు. దోమలు అధికంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి స్ప్రే చేయించాలని జిల్లా మలేరియా అధికారి సూచించారు. సాంఘిక సంక్షేమ పాఠశాలలో నెలలో రెండు సార్లు తగు జాగ్రత్తలు ఉండేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మలేరియా అధికారి రాజేందర్, హెల్త్ సూపర్‌వైజర్ దేవపాల, ఆరోగ్య కార్యకర్తలు మహాలక్ష్మి ఉన్నారు.



చంద్రయాన్‌పల్లిలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న సిబ్బంది

చంద్రయాన్‌పల్లిలో 'ఫ్రైడే డ్రైడే'

ఇందల్వాయి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చంద్రయాన్‌పల్లి గ్రామంలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని శుక్రవారం ఆరోగ్య విస్తరణ అధికారి శంకర్ పరిశీలించారు. దోమలు నివారణ కోసం నీటి నిల్వలు ఉండకుండా చూడాలని ఆశావర్కర్లకు ఆదేశించారు. గ్రామంలో ఎక్కడైనా నీటి నిల్వలు ఉన్నట్లయితే స్థానిక గ్రామ కార్యదర్శికి నివేదిక అందించాలన్నారు. దోమ లార్వాలు అధికంగా ఉన్నట్లయితే డెమోఫాస్‌స్ప్రే చేయించాలని గ్రామ కార్యదర్శులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకుడు అక్బర్ అలీ, కార్యకర్తలు ఉదయ, సావిత్రి, ఆశావర్కర్లు, పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్లను అందించాలి

ధర్పల్లి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను వెంటనే అర్హులలకు అందించాలని లేని పక్షంలో లబ్ధిదారులతో కలిసి ఆక్రమిస్తామని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి రమేష్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోగల తహసీల్దార్ మాలతికి వినతిపత్రాన్ని అందజేశారు. నిర్మాణం పూర్తయిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను ఇంతవరకు పంపిణీ చేయలేదని అర్హులైన వారికి వెంటనే పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో నిర్మించిన ఇళ్లు శిథిలావస్థకు చేరుకున్నా ఇప్పటికీ పంపిణీకి నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిరుపేదలు తమ కల నెరవేరుతుందని అనుకున్న ఎంతో ఆశగా ఎదురు చూసిన ఇంతవరకు పంపిణీ చేయకపోవడంతో వారికి నిరాశే మిగిలిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాలయాపన చేయకుండా అర్హులైన పేదలకు వెంటనే పంపిణీ చేయాలని మండల కేంద్రంలోని నిరుపేదలతో కలిసి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సుమన్, స్వరూప, లక్ష్మి, గంగామణి, తదితరులు పాల్గొన్నారు.

మగ్గం శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

డిచ్‌పల్లి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో మగ్గం వర్క్, బ్యూటీ పార్లర్ ఉచిత శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని డైరెక్టర్ సుంకం శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. ఆసక్తిగల నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు చెందిన మహిళలు, నిరుద్యోగ యువతులు డిచ్‌పల్లి ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ కార్యాలయంలో ఆధార్, రేషన్‌కార్డు, ఎస్సెస్సీ మెమో, ఐదు ఫొటోలతో దరఖాస్తు చేసుకోవాలని డైరెక్టర్ తెలిపారు.

మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తికి జైలు

నిజామాబాద్ లీగల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మాక్లూర్ మండలం గుత్పకు చెందిన గురజాల ప్రవీణ్ ఓ మహిళ ఇంటిలోకి అక్రమంగా ప్రవేశించి ఆమె పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన కేసులో సంవత్సరం సాధారణ జైలు శిక్ష విధిస్తూ నిజామాబాద్ నాల్గవ అదనపు జుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వడ్డి హరికుమార్ శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రవీణ్ 2016 జూలై 27న అర్ధరాత్రి సమయంలో ఓ మహిళ తన ఇంట్లో నిద్రిస్తుండగా ఇంట్లోకి ప్రవేశించి ఆమె గౌరవ మర్యాదలకు విరుద్ధంగా ప్రవర్తించాడనే నేరారోపణలు కోర్టు నేర న్యాయవిచారణలో రుజువు కావడంతో ప్రవీణ్‌కు సంవత్సరం జైలు శిక్షతో పాటు రూ.2వేల జరిమానా విధించారు. పోలీసుల తరఫున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ భూసారపు రాజేష్‌గౌడ్ ప్రాసిక్యూషన్ నిర్వహించారు.

'దొంగ పట్టాలు సృష్టించి ప్లాట్లు కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి'

నిజామాబాద్ అర్బన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి):నగరంలో దొంగ పట్టాలను సృష్టించి ప్లాట్లను కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఆదె ప్రవీణ్ అన్నారు. శుక్రవారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. 2002లో తాను కొనుగోలు చేసిన ప్లాట్ కబ్జాకు గురైందని నిజామాబాద్ ఎంఆర్‌వో కార్యాలయ అధికారులు, మున్సిపల్ అధికారుల ఫోర్జరీ సంతకాలతో కొందరు తప్పుడు అధికారుల అండదండలతో దొంగ పట్టాలను తయారు చేసి కబ్జాలు చేస్తున్నారని అన్నారు. ప్లాట్లను కబ్జా చేయడమే కాకుండా పోలీస్ స్టేషన్‌లలో తప్పుడు అట్రాసిటీ కేసులు పెడతామంటూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని అన్నారు. 1979, 1981, 1995 సంవత్సరాలకు చెందిన అన్ని లింక్ డాక్యుమెంట్లు కలిగి ఉన్న ప్లాటును కబ్జా చేశారని అన్నారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసిన చర్యలు తీసుకోలేదన్నారు. కోర్టులో కేసు వేస్తే కొందరు న్యాయవాదుల కుమ్మక్కుతో కోర్టులను కూడా తప్పుదోవ పట్టిస్తున్నారని అన్నారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ పెద్ద నాయకుల అండ చూసుకొని అధికారులను బెదిరింపులకు గురిచేస్తూ సామాన్యులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆయన అన్నారు. వర్ని రోడ్‌లో రాజకీయ నాయకుల అండతో కబ్జాలు జరుగుతున్నాయని ఆయన తెలిపారు. విలేకరుల సమావేశంలో ఎల్లయ్య, ఈర్ల శేఖర్, నాగభూషణం, దేవిదాస్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనం నడిపిన ఐదుగురికి జైలు

ఖిల్లా, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపిన ఐదుగురికి జైలు శిక్ష విధించినట్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తెలిపారు. ట్రాఫిక్ ఏసీపీ నారాయణ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలో వాహనాలు తనిఖీ చేయగా 24మంది మద్యం తాగి వాహనాలు నడిపినట్లు గుర్తించారు. వీరికి శుక్రవారం ఉదయం కౌన్సెలింగ్ నిర్వహించి సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పర్చగా జడ్జి నూర్‌జహాన్ వీరిలో ఐదుగురికి ఒకరోజు జైలు శిక్షతో పాటు మిగతా 19మందికి రూ. 43500 జరిమానా విధించినట్లు తెలిపారు.

నేడు డయల్ యువర్ 'ఆర్టీసీ కార్గో'

సుభాష్‌నగర్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్గో సమస్యల పరిష్కారం కోసం డయల్ యువర్ ఆర్టీసీ కార్గో కార్యక్రమాన్ని శనివారం నిర్వహిస్తున్నట్లు అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ పాల్ తెలిపారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని ఆర్టీసీ కార్గోలో సమస్యలు, సూచనల కోసం డయల్ యువర్ ఆర్టీసీ కార్గో కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఉదయం 11గంటల నుంచి 12గంటల వరకు 8125448423 నెంబర్‌కు ఫోన్ చేసి సమస్యలను విన్నవించాలని కోరారు.

బస్తీ దవాఖానలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్ అర్బన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బస్తీ దవాఖానలో ఖాళీగా ఉన్న 5 మెడికల్ ఆఫీసర్లు, 4 స్టాఫ్ నర్సు, 5 సపోర్టింగ్ స్టాఫ్ పోస్టులు ఎన్‌హెచ్‌ఎం ద్వారా కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో భర్తీ చేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి రాజశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. మెడికల్ ఆఫీసర్ పోస్టులకు ఎంబీబీఎస్ అర్హత కలిగిన వారు, స్టాఫ్‌నర్సుకు జీఎన్ఎం/బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసిన వారు, సపోర్టింగ్ స్టాఫ్ కోసం పదో తరగతి పాసైన వారు అర్హులన్నారు. ఈనెల 18 నుంచి 24 వరకు జిల్లా వైద్య శాఖ కార్యాలయం కొత్త కలెక్టరేట్‌లో దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని ఇతర వివరాలకు నిజామాబాద్.తెలంగాణ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు.

సర్వేలో తప్పులు లేకుండా చూడాలి

డిచ్‌పల్లి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేయనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఆహార భద్రత, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలకు అర్హుల ఎంపిక సర్వేలే తప్పులు లేకుండా చూడాలని ఆర్డీవో రాజేందర్ కుమార్ అధికారులకు సూచించారు. అధికారులు క్షేత్ర స్థాయిలో అధ్యయనం చేసి వాస్తవ పరిస్థితులను సర్వేలో నమోదు చేయ్యాలన్నారు. శుక్రవారం మండలంలోని దూస్‌గాం గ్రామంలో అధికారుల క్షేత్ర స్థాయి పరిశీలన సర్వే తీరును ఆర్డీవో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ప్రభాకర్, కార్యదర్శి, సిబ్బంది పాల్గొన్నారు.

సబ్‌సెంటర్ నిర్మాణానికి స్థల పరిశీలన

డిచ్‌పల్లి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఘన్‌పూర్ పంచాయతీ కార్యాలయం పక్కన నూతనంగా నిర్మించనున్న సబ్ సెంటర్ నిర్మాణానికి తహసీల్దార్, వీడీసీ సభ్యులతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. మత్స్యకార్మికులు సబ్‌సెంటర్ నిర్మాణ స్థలంలో తమ సంఘ భవనం నిర్మించేందుకు గతంలో స్థల పరిశీలన చేశామని తహసీల్దార్‌కు మత్స్యకార్మికులు విన్నవించారు. హెల్త్ సెంటర్ నిర్మాణంతో ఎంతో ఉపయోగం ఉంటుందని వీడీసీ సభ్యులు తహసీల్దార్‌కు వివరించారు. మత్స్యకార్మికుల సంఘ భవన నిర్మాణానికి మరో చోట స్థలం కేటాయించాలని వీడీసీ సభ్యులు తహసీల్దార్‌ను కోరారు.


చికెన్ ధరలు



రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.160	రూ.255	రూ. 275
వెన్‌కాబ్(కిలో)	రూ.165	రూ.260	రూ. 280



బంగారం ధరలు



బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.81100	రూ.74800	రూ.955

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : సంక్రాంతికి వస్తున్నాం (10.10, 1.10, 4.10, 7.10, 10.10)
స్క్రీన్-2 : డాకు మహారాజ్ (10.20, 1.25, 7.35, 10.40)
: ఎమర్జెన్సీ (హిందీ) (4.30)
స్క్రీన్-3 : గేమ్ చేంజర్ (12.00, 3.20, 6.40)
: ఎమర్జెన్సీ (హిందీ) (10.00)
స్క్రీన్-4 : ఎమర్జెన్సీ (హిందీ) (12.00)
: ఆజాద్ (హిందీ) (3.05, 10.15)
: పుష్ప-2 (6.10)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : సంక్రాంతికి వస్తున్నాం (11.00, 1.45, 4.30, 7.25, 10.20)
స్క్రీన్-2 : గేమ్ చేంజర్ (1.10, 7.35, 10.35)
: డాకు మహారాజ్ (4.30)
స్క్రీన్-3 : డాకు మహారాజ్ (11.00, 7.35, 10.30)



దేవి : డాకు మహారాజ్ (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : సంక్రాంతికి వస్తున్నాం (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : సంక్రాంతికి వస్తున్నాం (11.15, 2.15, 6.15, 9.15)
లలితామహల్ : గేమ్ చేంజర్ (11.30, 2.30, 6.30, 9.30)

- నిజామాబాద్ అర్బన్